https://www.tholikranthidaily.in
RNI No: TEL TEL- 12281

# తొలిక్రాంతి

మన గొంతుకే.. మన పత్రిక
తెలుగు దినపత్రిక..
THOLI KRANTHI

| హైదరాబాద్ | ఆదివారం | 01.03.2026 | సంపుటి : 1 | సంచిక :187 | పేజీలు : 8 | వెల : 2/- | ఎడిటర్ : మాలోతు చంద్రకళ |
|---|---|---|---|---|---|---|---|
| Hyderabad | Sunday | 01.03.2026 | volume : 1 | Issue : 187 | Pages : 8 | | |




పాక్ ఇంటికి.. కివీస్ సెమీస్‌కి
07






## పారిశ్రామికీకరణలో తెలంగాణ
# ఆదర్శం కావాలి

పారిశ్రామికీకరణలో తెలంగాణ ఆదర్శం కావాలి
ప్రతి ప్రభుత్వ ఆఫీస్‌కు సొంత భవనం ఉండాల్సిందే
ఆన్‌లైన్ విధానంలో అన్ని పనులు జరిగేలా చూడాలి
నిర్ణీత సమయంలో ఫైళ్లు క్లియర్ చేయాల్సిందే
99 రోజుల యాక్షన్ ప్లాన్‌పై అధికారులతో చర్చ
ఫ్యూచర్ సిటీపై దృష్టి పెట్టి పనిచేయండి
అధికారులకు దిశానిర్దేశం చేసిన సిఎం రేవంత్

హైదరాబాద్, తొలిక్రాంతి న్యూస్ : సీఎం రేవంత్‌రెడ్డి శనివారం సచివాలయంలో వివిధ శాఖలకు చెందిన ప్రభుత్వ ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. 99 రోజుల యాక్షన్ ప్లాన్‌పై సమావేశంలో

-మిగతా 2 లో..

## ఇరాన్‌లో స్కూల్‌పై
# బాంబు దాడి

### 40మంది మృతి చెందినట్లు సమాచారం
### చాలామందికి గాయాలు.. కొందరి పరిస్థితి విషమం

ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికాలు సంయుక్త దాడులతో విరుచుకుపడ్డాయి. ఈ క్రమంలోనే హార్మోజ్‌గాన్ ప్రావిన్స్‌లోని ఓ బాలికల పాఠశాలపై జరిగిన దాడిలో 40 మంది మృతి చెందినట్లు స్థానిక మీడియా వెల్లడించింది. మరో 45 మంది గాయపడినట్లు తెలిపింది. ఇరాన్ పారామిలిటరీ 'ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కోర్'కు ఈ ప్రాంతంలో స్థావరం ఉంది. అమెరికా, ఇజ్రాయెల్‌లు ఈ ఘటనపై ఇంకా స్పందించలేదు.





న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28 : సదరన్ ఇరాన్?లోని మినాబ్ సిటీలో ఉన్న ఒక ఎలిమెంటరీ గర్ల్స్ స్కూల్‌పై ఇజ్రాయెల్ బాంబులేసింది. ఈ దాడిలో 40 మంది విద్యార్థినులు చనిపోయా రు. చాలా మంది విద్యార్థు లు తీవ్రంగా

-మిగతా 2 లో..




ఇజ్రాయిల్ దాడుల్లో ఇరాన్ రక్షణమంత్రి హతం
ప్రకటించిన ఇజ్రాయిల్



## పెరిగిన మిర్చి ధర

క్వింటాకు గరిష్టంగా రూ.18,789 ధర
04
రైతుల్లో ఆనందం
గతంలో ఎప్పుడూ లేనంతగా పెరిగినట్లు వెల్లడి


08

మరోమారు భగ్గుమన్న
## పుత్తడి ధరలు

పెళ్లిళ్ల సీజన్ కావడంతో సామాన్యుల బెంబేలు

## బాణాసంచా తయారీ కేంద్రంలో
# భారీ పేలుడు

### 23మంది మృతి.. పలువురికి గాయాలు

సామర్లకోట సమీపంలోని వేట్ల పాలెం వద్ద ఘటన
ఘటనా స్థలిని పరిశీలించిన సిఎం చంద్రబాబు
మృతుల కుటుంబాలకు 20లక్షల చొప్పన సాయం
క్షతగాత్రులకు ప్రభుత్వ ఆధ్వర్యంలో పూర్తి చికిత్స



కాకినాడ, ఫిబ్రవరి 28 : కాకినాడ జిల్లాలోని సామర్లకోట మండలంలోని బాణసంచా తయారీ పరిశ్రమలో భారీ పేలు డు సంభవించింది. వేట్లపాలెం పరిధి గోదావరి కెనాల్ పక్కన ఉ న్న సూర్యశ్రీ ఫైర్

-మిగతా 2 లో..

## చట్టబద్ధంగా కేటాయించిన
# రెండెకరాలు లాగేసుకుంటారా

### విశాఖ శారదాపీఠం ఆలయం కూల్చివేస్తే అడ్డుకుంటాం

దేవాలయాలు, మఠాలను మింగాలన్న ఆలోచన ఎందుకు
కోకాపేట శారదాపీఠం భూముల స్వాధీనంపై హరీష్ ఆగ్రహం



హైదరాబాద్, తొలిక్రాంతి న్యూస్: కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఇండ్లతో పాటు ఇప్పుడు దేవాలయాలు, మఠాలను సైతం కూల్చేందుకు కుట్రలు చేస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ల హరీశ్ రావు మండిపడ్డారు. కోకాపేట్ నియోపోలిస్‌లోని విశాఖ

-మిగతా 2 లో..



## శారద పీఠం భూములు కొనసాగింపు

జలమండలికి కేటాయింపులు రద్దు
అధికారులపై సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం

హైదరాబాద్,ఫిబ్రవరి28 : కోకాపేటలో శారదా పీఠానికి కేటాయించిన భూమిని పీఠానికే కొనసాగించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. పీఠం భూములు

-మిగతా 2 లో..



### నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 135 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 162 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 235 (కిలో) |
| స్కిన్ లెస్ | 267 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹74




02

## రాష్ట్రంలో హెచ్‌పీవీ
# వ్యాక్సినేషన్ డ్రైవ్

కింగ్ కోఠి ఆస్పత్రిలో ప్రారంభించిన మంత్రి దామోదర
ఆడపిల్లలను క్యాన్సర్ బారినుంచి రక్షించే ప్రక్రియ
తల్లిదండ్రులు ఇందుకు ముందుకు రావాలన్న మంత్రి దామోదర

## టన్నుకు రూ.21546కు
# చేరుకున్న గెలల ధర

పామాయిల్ రైతులకు శుభవార్త
15024 మంది రైతులకు రూ. 2 కోట్ల మేర అదనపు లబ్ది
పామ్ సాగును లాభసాటిగా చేయడమే ప్రభుత్వ లక్ష్యం
ఆయిల్ ఫెడ్ ఫాక్టరీలలో ఆధునిక యంత్రాల ఏర్పాటు
మంత్రి తుమ్మల నాగేశ్వర రావు వెల్లడి

హైదరాబాద్, ఫిబ్రవరి28 :తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అ త్యంత ప్రాధాన్యం ఇస్తు న్నదని, రాష్ట్రంలో పంట మార్పిడి ఆవశ్యకత మరి యు వంట నూనెలను

-మిగతా 2 లో..



## ఆ రిపోర్టును
# చెత్తబుట్టలో వేయాలి

టీచర్ల జీతాలు తగ్గించాలని సూచిస్తారా
విద్యారంగ అభ్యున్నతికి ఒక్క సిఫార్స్ ఏదీ
సిఎం రేవంత్ తీరుపై మండిపడ్డ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

హైదరాబాద్ : ఇటీవల సిఎం రేవంత్‌కు సమ ర్పించిన విద్యా కమిషన్ రిపోర్టును చెత్తబుట్టలో వేయాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఎద్దేవా చేశారు. విద్యార ంగ అభ్యున్నతి కోసం సిఫారసులేవని ప్రశ్నిం చారు. టీచర్ల జీతాలను తగ్గించాలని చెప్పడం సిగ్గుచేటని అన్నారు. ఈ మేరకు తెలంగాణ సీఎం



-మిగతా 2 లో..

తొలిక్రాంతి
ఆదివారం
01 మార్చి 2026

# ప్రజలకు మేలు చేయడమే ప్రభుత్వ లక్ష్యం

(మొదటిపేజీ తరువాయి)

రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డి, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎంఓ అధికారులు పాల్గొన్నారు. మార్చి 4 న జరిగే కలెక్టర్ల సమావేశంలో అందరి పని తీరుపైన మాట్లాడుతానని అన్నారు. ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక పేరు తో 99 రోజుల కార్యాచరణ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమం కోసం ప్రత్యేక లోగో తయారు చేస్తున్నాం..కేంద్రం ఏర్పాటు చేసిన ఏ ఐ సమావేశం నిర్వహణ పైన కొన్ని విమర్శలు వచ్చాయి..కానీ తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్ అందరి దృష్టిని ఆకర్షించిందన్నారు. ప్రణాళికా బద్ధంగా జీహెచ్ ఎం సీ ని మూడు కార్పొరేషన్ లు గా విభజించాం..కోర్ అర్బన్ రీజియన్ లో చేపట్టాల్సిన కార్యాచరణ పైన అధికారులు దృష్టి పెట్టాలి..ప్యూర్ అర్బన్ రీజియన్ 10 వేల చదరపు కిలో మీటర్ల పరిధిలో విస్తరించి ఉంది..ఇక్కడ మాన్యుఫాక్చరింగ్ రంగం విస్తరించాలి. పారిశ్రామికీకరణ లో తెలంగాణ దేశానికి ఆదర్శంగా ఉండాలని అంటూ.. దీనిపైన అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సేవా రంగంలో వస్తున్న పెను మార్పులు గమనంలోకి తీసుకోవాలి..శాఖలపైన ప్రతి ఒక్కరికి సంపూర్ణ అవగాహన ఉండాలి.. శాఖలల్లో పనిచేస్తున్న ఉద్యోగులు,అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జాబితా సిద్ధం చేయాలి..ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో ఉండడానికి వీలు లేదు.. ప్రతి శాఖకు సొంత భవనం ఉండాలి..బడ్జెట్ ప్రతిపాదన లో వీటిని చేర్చాలి. కేంద్ర ప్రాయోజిత పథకాల పైన ప్రతి శాఖ దృష్టి పెట్టాలి..అధికారులు అప్రమత్తం గా ఉండాలి సర్వీస్ సెక్టార్ ను పూర్తి గా ప్రక్షాళన చేయాలి..ఆన్‌లైన్ విధానంలో అన్ని పనులు జరిగేలా చూడాలని సూచించారు. ఫైల్



విధానం ఉండాలి..నిర్ణీత సమయంలో ఫైల్ క్లియర్ కావాల్సిందే. వివిధ కంపెనీ లతో చేసుకున్న ఒప్పందాలు ,పెట్టుబడులు గ్రౌండ్ కావాలి.. పాత కాలం సర్వర్ లను అప్డేట్ చేసుకోవాలి.. సంక్షేమ పథకాలు పకడ్బందీగా అమలు చేయాలి..ఇందులో సాంకేతికత ను వినియోగించుకోవాలి. నిజమైన లబ్దిదారులకు సంక్షేమ పథకాలు అందాలి. 30 వేల ఎకరాల్లో నిర్మిస్తున్న ఫ్యూచర్ సిటీ పైన దృష్టి పెట్టాలి..ఫ్యూచర్ సిటీ దేశ ఆర్థిక స్థితిని ని మార్చబోతోంది..మూసీ నది పరివాహక ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తున్నాం ..ఇక్కడ వచ్చే మార్పులను ప్రజలకు వివరించాలి.డిజిటల్ గవర్నెన్స్ పైన దృష్టి పెట్టాలి..నాణ్యమైన విద్య ను అందించడం పైన దృష్టి సారించాలి.. వంద నియోజకవర్గాలలో తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ప్రారంభించుకోబోతున్నాం.. ప్రభుత్వ విద్యను ప్రక్షాళన చేస్తాం..ప్రభుత్వ ఆస్పత్రులలో వైద్య సేవలు మెరుగుపడాలి..ప్రాంతాల వారీగా మెడికల్ డేటా తయారు చేయాలి.ప్రతి సెక్రటరీ తమ శాఖ లల్లో బెస్ట్ ప్రోగ్రామ్ ను డిజైన్ చేసుకోవాలి.. మార్చి 6 నుంచి 99 రోజుల ప్రణాళిక జూన్ 12 వరకు జరగబోతుంది.. జూన్ 2 వరకు ప్రతి ఆఫీస్ పరిశుభ్రంగా కావాల్సిందే.. జూన్ 2 తెలంగాణ కు పండుగ..పండుగ ను అంతా ఘనంగా జరుపుకోవాలి. మార్చి 6 నుంచి జూన్ 12 వరకు ప్రజా పాలన– ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ప్రతి అధికారి ఈ కార్యక్రమం లో పాల్గొనాలి..మినహాయింపు లు ఉండవు శాఖ ల మధ్య సమన్వయం ఉండాలి.. ప్రతి ఎన్నికలో ప్రజలు నాకు కావాల్సిన బలాన్ని ఇచ్చారు.. ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని మనం ప్రజలకు మంచి చేయాల్సి ఉందని సిఎం రేవంత్ సూచించారు.

## ఇరాన్‌లో స్కూల్‌పై బాంబు దాడి

(మొదటిపేజీ తరువాయి)

గాయపడ్డారు. గాయపడిన వారిలో కొంతమంది పరిస్థితి విషమంగా ఉంది. మినాబ్ సిటీ ఈ బాంబు దాడులతో వణికిపోయింది. మధ్యాహ్నం 2 గంటల 45 నిమిషాల సమయంలో ఈ ఘటన జరిగింది. ఇదిలా ఉండగా.. ఇజ్రాయెల్‌తో పాటు గల్ఫ్ దేశాలను కూడా ఇరాన్ టార్గెట్ చేసింది. సౌదీ అరేబియా, అబుదాబితో సహా 8 దేశాలపై ఇరాన్ మిస్సైల్స్‌తో అటాక్ చేస్తుండటంతో యూఏఈ, బెహ్రెయిన్, ఖతార్, జోర్డాన్, కువైట్ దేశాలు భయంతో వణికిపోతున్నాయి. బెహ్రయిన్‌లోని అమెరికా మిలటరీ బేస్‌పై ఇరాన్ బాంబు దాడులు చేసింది. ఈ దాడి దృశ్యాలు ఇంటర్నెట్‌లో వైరల్‌గా మారాయి. ఖతార్ రాజధాని దోహాలో కూడా రెండు ప్రాంతాల్లో పేలుళ్లు సంభవించినట్లు ఖతార్ రక్షణ శాఖ ధృవీకరించింది. ఇదిలా ఉండగా.. బెహ్రెయిన్, ఖతార్, జోర్డాన్, కువైట్ దేశాలపై ఇరాన్ అటాక్స్‌ను సౌదీ అరేబియా తీవ్రంగా ఖండించింది.

## ఇజ్రాయిల్ దాడుల్లో ఇరాన్ రక్షణమంత్రి హతం

(మొదటిపేజీ తరువాయి)

అమీర్ నాసిర్జాదే మృతి చెందినట్టు తెలుస్తోంది. ఇజ్రాయెల్ మిటలరీ ఆపరేషన్స్ వర్గాలు ఈ విషయాన్ని వెల్లడించాయి. అయితే దీనిపై ఇరాన్ అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. అమీర్ నాసిర్జాదే 2024 ఆగస్టు నుంచి ఇరాన్ రక్షణ మంత్రిగా వ్యవహరిస్తున్నారు. గతంలో ఇరానియన్ సాయుధ దళాల డిప్యూటీ ఆఫ్ స్టాఫ్‌గా, ఇరాన్ ఎయిర్‌ఫోర్స్ కమాండర్‌గా సేవలందించారు. ఇదే దాడుల్లో ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ కమామండర్ మహమ్మద్ పాక్పౌర్ కూడా మరణించినట్టు మీడియా కథనాలు వెల్లడించాయి. ఇజ్రాయెల్ వర్గాలు ఈ విషయాన్ని ధ్రువీకరించాయి. ఇరాన్ మాత్రం ఇంకా స్పందించాల్సి ఉంది. ఇరాన్ నాయకులే లక్ష్యంగా ఇజ్రాయెల్–అమెరికా టెహ్రాన్‌పై దాడులకు దిగాయి. టెహ్రాన్‌లోని మొత్తం 30 ప్రాంతాలపై బాంబుల వర్షం కురిపించాయి. ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ నివాసాన్ని టార్గెట్ చేసుకుని ఇజ్రాయెల్ దళాలు దాడులకు దిగాయి. అయితే ఖమేనీ అంతకు ముందే సురక్షితంగా తప్పించుకున్నట్టు సమాచారం. ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ, అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్ లక్ష్యంగానే ఈ దాడులు జరిగినట్టు కథనాలు వెలువడుతున్నాయి.

## విశాఖ శారదాపీఠం ఆలయం కూల్చివేస్తే అడ్డుకుంటాం

(మొదటిపేజీ తరువాయి)

శారద పీఠం, రాజశ్యామల అమ్మవారి ఆలయాన్ని రెవెన్యూ, పోలీసు అధికారులు అకస్మాత్తుగా చుట్టుముట్టి ఖాళీ చేయాలంటూ భయాందోళనలకు గురిచేస్తున్న నేపథ్యంలో హరీశ్‌రావు హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. ఆలయాన్ని సందర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. వినాశకాలే విపరీత బుద్ధి అన్నట్లు రేవంత్ రెడ్డి పాలన తయారైందని హరీశ్‌రావు అన్నారు. అడ్డగోలు వ్యవహారాలకు, అక్రమాలకు పాల్పడుతున్న ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు ఏకంగా దేవాలయాలు, మఠాలను కూడా కూల్చే స్థాయికి దిగజారిందని విమర్శించారు. 2019లో కేసీఆర్ ప్రభుత్వంలో కోకాపేట సర్వే నెంబర్ 240లో విశాఖ శారద పీఠానికి చట్టబద్ధంగా క్యాబినెట్ ఆమోదంతో రెండు ఎకరాల స్థలాన్ని కేటాయించామని తెలిపారు. పీఠం నిర్వాహకులు ప్రభుత్వానికి 1.05 కోట్లు చెల్లించి రిజిస్ట్రేషన్ కూడా చేసుకున్నారని పేర్కొన్నారు. అలాగే హెచ్‌ఎండీఏ కు రూ. 23 లక్షలు చెల్లించి అనుమతులు, విద్యుత్ కనెక్షన్ అన్నీ తీసుకున్నారని చెప్పారు. ఇక్కడ అద్భుతమైన శారదా స్వరూప రాజశ్యామల అమ్మవారి దేవాలయం, గోశాల, నిత్య అన్నదాన సత్రం, వేద పాఠశాల నిర్మించారని అన్నారు. హైకోర్టు న్యాయమూర్తులు, అధికారుల సమక్షంలో పెద్ద స్వామీజీ చేతుల మీదుగా ప్రతిష్టా కార్యక్రమం జరిగిందని గుర్తుచేశారు. అప్పటి నుంచి ఇక్కడ నిత్య పూజలు జరుగుతున్నాయన్నారు. హైదరాబాద్‌లో శారద పీఠం కింద 16 దేవాలయాలు, లక్షలాది మంది భక్తులు ఉన్నారని తెలిపారు. కేసీఆర్ ఆనవాళ్లు చెరిపేస్తా అంటూ.. కేసీఆర్ కట్టిన గుళ్లు, గోపురాలు, మఠాలను కూల్చడమేనా రేవంత్ రెడ్డి ఉద్దేశమని హరీష్ రావు మండిపడ్డారు.

## రాష్ట్రంలో హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ డ్రైవ్

**హైదరాబాద్, ఫిబ్రవరి 28 :** హైదరాబాద్ కింగ్ కోఠి హాస్పిటల్‌లో హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ డ్రైవ్‌ను ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ శనివారం ప్రారంభించారు. వ్యాక్సిన్ వేయించుకున్న బాలికలకు మంత్రి వ్యాక్సినేషన్ సర్టిఫికెట్లను అందజేసారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ పాల్గొన్నారు. నేటి నుంచి 3 నెలల వరకూ వ్యాక్సినేషన్ కార్యక్రమం కొనసాగనున్నది. తొలి నెల రోజుల వరకూ ప్రభుత్వ జనరల్ హాస్పిటళ్లు, ఏరియా హాస్పిటళ్లు, కమ్యునిటీ హెల్త్ సెంటర్లలో అందుబాటులో వ్యాక్సినేషన్ ఉండనున్నది.. తర్వాత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనూ అందుబాటులోకి రానున్నది. ఈ సందర్భంగా మంత్రి దామోదర మాట్లాడుతూ ఈ రోజు మనం ఆరోగ్య రంగంలో ఒక చారిత్రాత్మక ఘట్టాన్ని ఆవిష్కరించుకున్నాం అన్నారు. ఆడబిడ్డల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ఒక బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టుకున్నాం అన్నారు. మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లు, కాలుష్యం వంటి అనేక కారణాల వల్ల దేశవ్యాప్తంగా క్యాన్సర్ మహమ్మారి కోరలు చాస్తోంది.దురదృష్టవశాత్తు, మన రాష్ట్రంలో కూడా ఏటా 55,000 నుండి 60,000 క్యాన్సర్ కేసులు నమోదవుతున్నాయి. రాబోయే ఐదేళ్లలో ఈ సంఖ్య మరో 10శాతం పెరుగుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ ప్రమాదాన్ని ఎదుర్కోవడానికి మన ప్రభుత్వం ఒక సమగ్ర క్యాన్సర్ పాలసీని రూపొందించింది. కేన్సర్ వైద్య సేవలు కేవలం హైదరాబాద్ కే పరిమితం కాకుండా, ములుగు, ఆదిలాబాద్ వంటి మారుమూల జిల్లాల్లో కూడా ఇప్పుడు కీమోథెరపీ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చాం. ప్రతి జిల్లాలో డే కేర్ క్యాన్సర్ సెంటర్లను ఏర్పాటు చేశాం అని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు.

## ఆ రిపోర్టును చెత్తబుట్టలో వేయాలి

(మొదటిపేజీ తరువాయి)

రేవంత్‌రెడ్డిపై బండి సంజయ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.విద్యావేత్తలు లేని విద్యా కమిషన్ ఇదని విమర్శించారు. శనివారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో బండి సంజయ్ మాట్లాడారు. అర్బన్ నక్సలైట్ ఆధ్వర్యంలో వేసిన కమిషన్‌కు విలువేముందని నిలదీశారు. విద్యాశాఖకు మంత్రి లేరనే విషయాన్ని కూడా గుర్తించని కమిషన్ ఎందుకని బండి సంజయ్ ప్రశ్నల వర్షం కురిపించారు. చాక్ పీసులకు పైసల్లేక, స్కావెంజర్లు లేక స్కూళ్లు అల్లాడుతుంటే పరిష్కార మార్గాలు చూపరా..? అని ఫైర్ అయ్యారు. కనీస ఉత్తీర్ణత మార్కులను 35 నుంచి 45కు పెంచడం దుర్మార్గమని అన్నారు. పేద విద్యార్థులు స్కూల్ స్థాయిలోనే ఫెయిలై ఉన్నత విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. విద్యావేత్తలు, ఉపాధ్యాయ సంఘాలతో, విద్యార్థుల తల్లిదండ్రుల అభిప్రాయాలను తీసుకోకుండా రూపొందించిన ఏకపక్ష నివేదిక ఇదని ధ్వజమెత్తారు. ఉపాధ్యాయులను విద్యా కమిషన్ అవమానించిందని బండి సంజయ్ మండిపడ్డారు. స్థానిక పరిస్థితులను పట్టించుకోకుండా విదేశాల్లో తిరిగి నివేదిక ఇస్తే ఒరిగేదేముంది..? అని ప్రశ్నల వర్షం కురిపించారు. ఉపాధ్యాయులారా...మీకు అండగా బీజేపీ ఉంటుందని భరోసా కల్పించారు. ఇళ్ల కూల్చివేతలో రేవంత్‌రెడ్డికి గిన్నిస్ రికార్డు ఖాయమని ఎద్దేవా చేశారు.

## మదీనా బస్ ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు పరిహారం

(మొదటిపేజీ తరువాయి)

తెలిసిందే. మక్కా నుంచి బయలుదేరిన బస్సు ముందు వెళ్తున్న డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. దీంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. బస్సు ప్రమాదంలో 44 మంది హైదరాబాద్ వాసులు సజీవ దహనమైన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి సచివాలయంలో మీడియాతో మాట్లాడారు. మదీనా ప్రమాదం గురించి తెలియగానే సహాయ చర్యలపైన కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడానని ప్రస్తావించారు. మంత్రి అజారుద్దీన్‌ను వెంటనే మదీనా పంపించానుని గుర్తుచేశారు. బాధిత కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం ఇవ్వాలని మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. దేశం బయట జరిగే ప్రమాదాలకు ప్రభుత్వాలు పరిహారం చెల్లించదని.. కానీ బాధితుల కుటుంబాల పరిస్థితి చూసి సహాయం ప్రకటించామని అన్నారు. నాంపల్లి అగ్నిప్రమాదంలో చనిపోయిన వారి కుటుంబాలను కూడా ఆదుకున్నామని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం అండగా ఉంటుందనే నమ్మకాన్ని ప్రజకు కలిగించామని చెప్పుకొచ్చారు. అందుకే కుటుంబాలను సెక్రటేరియట్‌కి పిలిచి పరిహారం అందించామని వివరించారు. ఇది ప్రజల ప్రభుత్వమని.. ఆందోళన చెందొద్దని అన్నారు. ప్రజల కష్టం, ఆనందంలో మీతో ఉంటుందని ధైర్యం చెప్పారు. ఈ ప్రభుత్వం మీది.. ఎటువంటి ఆందోళన చెందాల్సిన పని లేదు.. మీకు అండగా ఉంటామంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. మదీనాలోప్రమాదఘటన తెలుసుకున్న వెంటనే మంత్రి అజహరుద్దీన్ నేతృత్వంలోని ప్రతినిధి బృందాన్ని మదీనాకుపం పామని సీఎం గుర్తు చేశారు. చనిపోయిన వారి కుటుంబ సభ్యులకు తక్షణమే పాస్‌పోర్టులు, వీసాలు ఇప్పించి మదీనాపంపిం చామన్నారు. అక్కడిభారత్ కాన్సులేట్, సౌదీ ప్రభుత్వంతో చర్చించి మృతిచెందిన వారి అంత్యక్రియలు జన్నుతుల్బఖీలోచేయించామన్నారు. ఈ చెక్కులను ఇళ్లకు పంపించవచ్చని.. కానీ మీ అందరితోకలవాలని... మీకు అండగాఉంటామనే భరోసాకల్పించా లనే ఉద్దేశంతోనే సచివాలయానికి పిలిపించామని సీఎం అన్నారు. ముస్లిం సోదరులతో తనకున్న అనుబంధాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. తాను కొడంగల్ ఎమ్మెల్యేగా ఎన్నికైన 2009సంవత్సరం నుంచి నియోజకవర్గంలోని అయిదు మండలాల నుంచి ఒకొక్కరి చొప్పున ఏటా అయిదుగురిని తన సొంత ఖర్చులతో హజ్ యాత్రకుపంపుతున్నానని సీఎం తెలిపారు. వారిని ఎంపిక చేసే బాధ్యత స్థానిక ముస్లిం మతపెద్దలకే అప్పజెప్పానన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్, ముఖ్యమంత్రి సలహాదారు వేంనరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, నాంపల్లి ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్, హజ్కమిటీఛైర్మన్ ఖుస్రో పాషా, తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ వైస్ ఛైర్మన్ఫహీంఖురేషి, రాష్ట్ర మైనార్టీ ÷నాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. ఈ నెల ముస్లింలకు చాలా పవిత్రమైనదని..అంతా కలిసి మెలిసి ముందుకెళ్దామని పిలుపునిచ్చారు.

## బాణాసంచా తయారీ కేంద్రంలో విస్ఫోటనం

వర్క్స్ కేంద్రంలో శనివారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఒక్కసారిగా పేలుడు సంభవించింది. ఈ ఘటనలో 20 మంది ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది. భారీ ఎత్తున మంటలు ఎగసిపడడంతో ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ వ్యాపించింది. పేలుడు శబ్దాలు సుమారు 5 కిలోమీటర్ల మేర వినిపించాయని స్థానికులు తెలిపారు. శబ్దం తీవ్రతకు పక్క గ్రామంలో ఉన్న ప్రైవేటు పాఠశాలలో శ్లాబ్‌కు పగుళ్లు వచ్చాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది మంటలు ఆర్పేందుకు 2 ఫైర్ ఇంజిన్ల సాయంతో రంగంలోకి దిగారు. తీవ్రంగా గాయపడిన 8 మందిని అంబులెన్స్‌లో స్థానిక ఆస్పత్రికి తరలించారు. మృతుల్లో ఎక్కువ మంది మహిళలే ఉన్నట్లు సమాచారం. బాణసంచా పరిశ్రమను అడపా నాని కుటుంబ సభ్యులు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. పరిమితికి మించి బాణసంచా తయారు చేయడం వల్లే ఘటన జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. పేలుడు సంభవించినప్పుడు భారీ శబ్దం వచ్చినట్లు స్థానికులు చెబుతున్నారు. పేలుడు ధాటికి చుట్టు పక్కల గ్రామాల ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. ఐదు గ్రామాల పరిధిలో దట్టమైన పొగలు అలముకున్నాయి. పేలుడు సంభవించే ప్రాంతానికి స్థానికులు చేరుకున్నప్పటికే అందులో చిక్కుకున్న పలువురు అగ్నికి ఆహుతయ్యారు. ఘటనాస్థలిలో శరీరభాగాలు చెల్లా చెదురుగా పడి ఉన్నాయి. కొన్ని మృతదేహాలు పూర్తిగా కాలిపోయాయి. మృతుల్లో ఇప్పటి వరకు 11 మందిని పోలీసులు గుర్తించారు. మృతులను అడబాల శ్రీను, కడింపల్లి కృపమ్మ, కడింపల్లి ధనరాజు, సాధనాల సత్యవేణి, వట్లూరి రవి, మందపల్లి చిన్ని, నిమ్మద కరుణ, గంపల మంగ, గొడతా మహేశ్, గొడతా రాము, గొడతా నానిగా పోలీసులు పేర్కొన్నారు. ఇంకా కొద్ది మంది మృతదేహాలను గుర్తించాల్సి ఉంది. టపాసులు తయారు చేస్తుండగా ఒక్కసారిగా పేలుడు సంభవించినట్లు సమాచారం. పేలుడు ధాటికి మృతదేహాలు చెల్లాచెదురుగా పడ్డాయి. అలాగే ఈ ప్రమాదంలో అనేమంది కార్మికులకు తీవ్ర గాయాలు అయ్యాయి. పేలుడు సమయంలో మొత్తం 30 మంది కార్మికులు ఉన్నట్లు తెలుస్తోంది. భారీగా మంటలు ఎగిసిపడ్డాయి. పేలుడుతో ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ అలముకుంది. సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేసేందుకు యత్నించారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం. మృతుల్లో ఎక్కువమంది మహిళలు ఉన్నారు. పేలుడు శబ్దం విని స్థానికులు భారీగా అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఘటనాస్థలిలో మృతుల బంధువుల ఆర్తనాదాలు మిన్నంటాయి.

## ఘటనా స్థలిని పరిశీలించిన సిఎం చంద్రబాబు

- మృతుల కుటుంబాలకు 20లక్షల చొప్పన సాయం
- క్షతగాత్రులకు ప్రభుత్వ ఆధ్వర్యంలో పూర్తి చికిత్స
- బాణాసంచా తయారీ కేంద్రాల్లో పక్కాగా నిబంధనలు
- పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని అధికారులకు ఆదేశం



**కాకినాడ, ఫిబ్రవరి 28 :** కాకినాడ జిల్లా వేట్లపాలెంలో జరిగిన బాణసంచా పేలుడు ఘటనలో మృతుల సంఖ్య 21కు చేరింది. ఈ ప్రమాదంలో మృతుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. మరో 9మంది తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నారు.అయితే, వేట్లపాలెంలో బాణసంచా ప్రమాద స్థలిని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరిశీలించారు. జిల్లా కలెక్టర్ వాహనంలో వేట్లపాలెం చేరుకున్నారు. బాణసంచా పేలుడు బాధిత కుటుంబాలను పరామర్శించారు. పేలుడు ఘటనపై సీఎం చంద్రబాబు ఆరా తీశారు. పేలుడు ఘటన తీరును అధికారులు సీఎంకి వివరించారు. ఈ ఘటనపై పూర్తి నివేదిక ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక ప్రకటన చేశారు. ఈ ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలకు ప్రభుత్వం తరఫున రూ.20 లక్షల ఆర్థిక సాయం అందిస్తామని ప్రకటించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. పేలుడులో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలను ఆదుకునేందుకు రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన సీఎం చంద్రబాబు, బాధితులకు అవసరమైన అన్ని సహాయాలు అందిస్తామని మాటిచ్చారు. అలాగే మృతుల కుటుంబాల పిల్లల విద్య బాధ్యతను పూర్తిగా ప్రభుత్వం తీసుకుంటుందని స్పష్టం చేశారు. వారి చదువు పూర్తయ్యే వరకు అవసరమైన అన్ని ఖర్చులనూ భరిస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులకు ఎంత ఖర్చయినా మెరుగైన వైద్యం అందిస్తామని సీఎం చంద్రబాబు తెలిపారు. బాధితుల ఆరోగ్య పరిస్థితిని అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. వైద్య సేవల్లో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ ఘటనలో నిర్లక్ష్యం వహించిన అధికారులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంది. ఆర్డీవో, డీఎస్పీ, అగ్నిమాపక శాఖాధికారి, కార్మిక శాఖ అధికారులను సస్పెండ్ చేసినట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారు. బాధ్యతల నిర్వహణలో విఫలమైన వారిపై మరింత కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉందని తెలిపారు. ఈ ప్రమాదానికి కారణమైన బాణసంచా వ్యాపారులపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని సీఎం చంద్రబాబు హెచ్చరించారు. వారి ఆస్తులను జప్తు చేసి బాధితులకు అందజేస్తామని తెలిపారు. బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని స్పష్టం చేశారు. గత ఏడాది కొమరపాలెంలో జరిగిన బాణసంచా పేలుడు ఘటన తర్వాత ప్రభుత్వం ఒక ప్రత్యేక పాలసీ రూపొందించినట్లు సీఎం చంద్రబాబు తెలిపారు.

## పామాయిల్ రైతులకు శుభవార్త

(మొదటిపేజీ తరువాయి)

డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని ఆయిల్ పామ్ సాగును రాష్ట్రంలో పెద్ద ఎత్తున్న చేపట్టడానికి ప్రభుత్వం నిర్ణయించిందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలియజేసారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన నాటికి టన్నుకి ఆయిల్ పామ్ గెలల ధర రూ12534 ఉండగా ఈ నెల ఆయిల్ పామ్ గెలల ధర రూ21546 పెరగడం తో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు.ఖ పెరుగుతున్న ధరలను దృష్టిలో ఉంచుకొని రైతులు ఆయిల్ పామ్ సాగుకు ముందుకు రావాలని మంత్రి వర్యులు పేర్కొన్నారు. ఆయిల్ పామ్ రైతులకు అధిక ధరలను అందించి ఆయిల్ పామ్ సాగును లాభ సాటిగా చేయటమే ప్రభుత్వ లక్ష్యం అని మంత్రి పేర్కొన్నారు. ఆయిల్ ఫెడ్ వారి ప్రోసెసింగ్ మిల్లులలో నూనె రికవరీ శాతం మరియు ముడి పామాయిల్ అమ్మకం ధరల ఆధారంగా ప్రతి నెల ఆయిల్ పామ్ గెలల ధర నిర్ణయించడం జరుగుతుంది. అయితే తెలంగాణ ఆయిల్ ఫెడ్ ద్వారా నడపబడుతున్న అప్పరావ్ పేట అశ్వరావుపేటలోని ఆయిల్ పామ్ కర్మాగారాలలో నూతన టెక్నాలజీతో కొత్త యంత్రాలు ఏర్పాటు చేయడం మరియు ఉన్న యంత్రాలను అధునికరించడం వల్ల ఆయిల్ పామ్ గెలల నుండి వచ్చే నూనె రికవరీ శాతం టన్నుకు 20.01 శాతముకు పెరగడం వల్ల టన్నుకు ఆయిల్ పామ్ గెలల ధర పెరుగుదలతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని మంత్రివర్యులు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో నిర్ణయించబడిన ఆయిల్ పామ్ గెలల ధరను ఆంధ్రప్రదేశ్ లో కూడా ఇవ్వాల్సిరావడంతో అక్కడ పామ్ ఆయిల్ రైతులకు కూడా ప్రయోజనం చేకూరుతున్నదని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో 1992-93 నుంచి ఇప్పటి వరకు 2.90 లక్షల ఎకరాలను ఆయిల్ పామ్ సాగులోకి తీసుకురావడం జరిగిందని, ఈ ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి 1,07,400 ఎకరాలలో 33500 మంది రైతులు ఆయిల్ పామ్ సాగు చేపట్టరని 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఆయిల్ పామ్ సాగు కోసం 456 కోట్లు కేటాయించినట్లు మంత్రి పేర్కొన్నారు. వచ్చే సంవత్సరంలో మరో రెండు లక్షల ఎకరాలలో ఆయిల్ పామ్ సాగు చేపట్టేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతున్నదని పేర్కొన్నారు.

## శారద పీఠం భూములు కొనసాగింపు

(మొదటిపేజీ తరువాయి)

జల మండలికి కేటాయించిన నేపథ్యంలో అక్కడ సాగుతున్న నిర్మాణ పనుల విషయాలను పీఠం ప్రతినిధులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ అంశంపై రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులతో శనివారం సాయంత్రం సమావేశమయ్యారు. కోకాపేట భూముల్లో పీఠం ఆధ్వర్యంలో వివిధ నిర్మాణాల తాజా స్థితిని ముఖ్యమంత్రి తెలుసుకున్నారు. పీఠం భూములను జలమండలికి కేటాయించే సమయంలో నిర్మాణాల స్థితిని తెలియజేయకపోవడంపై ముఖ్యమంత్రి మండిపడ్డారు. జల మండలికి కేటాయింపులు రద్దు చేసి పీఠానికే ఆ భూములు కొనసాగించాలని ఆదేశించారు. మంత్రి శ్రీధర్‌బాబును కలిసి నిర్మాణాలు, ఇతర పరిస్థితులను వివరించాలని ముఖ్యమంత్రి, పీఠం ప్రతినిధులకు సూచించారు.

# భూదాన్ భూములు వ్యవహారంలో సంయమనం పాటించండి

- అర్హులైన పేదలను గుర్తించాల్సిందిగా కలెక్టర్‌కు ఆదేశం
- పేదలకు ఇందిరమ్మ ఇళ్ళు ఇచ్చి ప్రభుత్వం అండగా ఉంటుంది
- మంత్రి తుమ్మల నాగేశ్వర రావు



**హైదరాబాద్, ఫిబ్రవరి 28 :** ఖమ్మం జిల్లాలో భూదాన్ భూముల వ్యవహారంలో జరుగుతున్న ప్రచారం పట్ల ఆవేశానికి లోనుకాకుండా కార్యకర్తలు సంయమనంతో వ్యవహరించాలని కోరుతున్నట్లు మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. ఈ విషయంలో దుష్ప్రచారం చేస్తున్న కొందరు రాజకీయ ప్రేరేపిత వ్యక్తులు, సోషల్ మీడియా వ్యక్తుల పై కేసులు పెట్టాల్సిన అవసరం లేదు. పేదల పట్ల మన నిబద్ధత, మానవీయ కోణం రేపటి నాడు స్పష్టమయ్యాక వాళ్లు కూడా ప్రభుత్వ చర్యను సమర్థించాల్సిన పరిస్థితి వస్తుంది. భూదాన్ భూముల్లో అర్హులైన ప్రతి పేదవాడికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో గూడు ఇచ్చే బాధ్యత నాది. పేదల సంఘం ముసుగులో విలువైన ప్రభుత్వ భూమిని కొందరు వ్యక్తులు అన్యాక్రాంతం చేసి, పేదలను అడ్డు పెట్టుకుని సొమ్ము చేసుకుంటుంటే బాధ్యత గల ప్రభుత్వంగా చూస్తూ ఊరుకోదు. అక్రమార్కుల పై చర్యల విషయంలో ఎంత కఠినంగా ఉంటామో, పేదల విషయంలో అంతే మానవీయంగా ఉంటాం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రజా ప్రభుత్వంలో ఏ పేదవాడికి అన్యాయం జరగదు. ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు కట్టింది, గృహ ప్రవేశాలు చేయించే బాధ్యత నేను తీసుకుంటాను. అక్రమార్కుల చేతిలో మోసపోయి, హక్కు లేని భూమిలో, కబ్జాదారుల్లాగా బతకాల్సిన ఖర్మ పేదలకు లేదు. గత ఆరేడేళ్లుగా భూదాన్ భూముల్లో కనీస సదుపాయాలు లేని దుర్భర పరిస్థితుల్లో పేదలు బతుకుతున్నారు. కరెంట్, డ్రైనేజీ, తాగేందుకు కనీసం మంచినీటి వసతి, సరైన రోడ్లు కూడా లేని దుస్థితి అక్కడ ఉంది. కొందరు కబ్జాదారుల చర్యలతో అన్యాక్రాంతమైనందువల్ల అక్కడ కనీస సదుపాయాలు కూడా కల్పించలేని పరిస్థితి ప్రభుత్వానికి ఉంది. ఈ ప్రభుత్వంలో పేదలు ఇంత దుర్భర బతుకులు బతకాల్సిన అవసరం లేదు. ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు కట్టించి, సకల సౌకర్యాలతో, మీ ఇంటిపై మీకు సంపూర్ణ హక్కులతో, ఆత్మగౌరవంతో బతికేలా మీ తరఫున నేను ఉన్నానని భరోసా ఇస్తున్నాను. దోపిడీదారులు, భూకబ్జాదారుల మాటలకు లోనై ఆందోళన చెందవద్దు అని పేదలకు పిలుపునిస్తున్నాను. పేదల వెరిఫికేషన్ వేగంగా సాగుతోంది. నాలుగు దశాబ్దాల రాజకీయ జీవితంలో నేను పేదలకు చేసిన సేవ జిల్లా ప్రజానీకానికి తెలుసు. కమ్యూనిస్ట్ పార్టీలకు నా నిబద్ధత తెలుసు. పేదల సంఘం పేరుతో సాగుతున్న భూదందా పై కమ్యూనిస్ట్ పార్టీలు కూడా ఖండించారు. వాస్తవాలు కప్పి పుచ్చి అక్రమార్కులకు వంత పాడిన వారి గూర్చి ప్రజలకు తెలుసు. కాంగ్రెస్ పార్టీ నేతలు కార్యకర్తలు సోషల్ మీడియా వార్తలపై పట్టించుకోవాల్సిన అవసరం లేదు. పేదల సంఘం చేతిలో మోస పోయిన పేదలకు మానవీయ కోణంలో ప్రభుత్వం అండగా ఉంటుంది. భూదాన్ భూములు అక్రమాల పై ప్రభుత్వం విచారణ సాగుతుంది. పేదల ముసుగులో ఓ సంఘం చేసిన దోపిడి పై వచ్చిన పిర్యాదులు ఆధారంగా విచారణ సాగుతుంది. విచారణ పూర్తయ్యే వరకు కాంగ్రెస్ పార్టీ నేతలు కార్యకర్తలు సంయమనం పాటించాలి. యూట్యూబ్ జర్నలిస్ట్ లపై పోలీస్ పిర్యాదులు వద్దు. విచారణ పూర్తయ్యాక నిజాలు వెలుగులోకి వస్తాయని, వాస్తవాలు తెలిసి ఆ జర్నలిస్ట్ లు పశ్చాత్తాప పడతారు. దుష్ప్రచారం చేసే ప్రతిపక్ష నేతలకు ప్రజలే బుద్ధి చెబుతారు. నాలుగు దశాబ్దాల రాజకీయ జీవితంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా అబివృద్ధి ధ్యేయంగా, పేదల సంక్షేమమే ప్రాధాన్యంగా పని చేశాను. ఇకపై అంతే నిబద్ధతతో ప్రజలకు సేవ చేస్తాను. కలెక్టరేట్ పక్కనే ప్రభుత్వ స్థలంలో అమాయక పేదలకు నకిలీ పట్టాలు ఇచ్చి.. వారితో గుడిసెలు వేయించి పేదల సంఘం పేరుతో లక్షలు రూపాయలు వసూళ్లు చేసి చుట్టు పక్కల ప్రైవేట్ స్థలాల వారిపై దౌర్జన్యం చేస్తుంటే ప్రభుత్వం చట్ట ప్రకారం చర్యలు తీసుకుంది. దీనిని రాజకీయ దుమారంగా మార్చి పబ్బం గడుపుకోవాలని కొందరు చూస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్లు కట్టే ప్రభుత్వానికి వెలుగుమట్ల బాధితులకు ఇళ్లు కట్టించి ఇవ్వడం భారమా అని అన్నారు. వెలుగుమట్ల భూదాన్ భూములు ఆక్రమణలో పేదల సంఘం చేసిన మోసాలు బయటకు రాకుండా ప్రతిపక్ష పార్టీల సహకారంతో సోషల్ మీడియాలో ప్రభుత్వం పై బురద జల్లే ప్రయత్నం చేశారు. వాస్తవాలు కమ్యూనిస్ట్ పార్టీలకు తెలుసు కాబట్టే పేదల సంఘం దురాగతాలు వారు కూడా ఖండించారు. భూదాన్ భూములకు నకిలీ పట్టాలు ఇచ్చి పేదలతో గుడిసెలు వేయించి తీరా వారి అక్రమం బయటపడితే.. పేదల వద్ద లక్షలు రూపాయలు వసూళ్లు చేసిన ముఠాపై ప్రభుత్వం ఉదారంగా ఉండాలా ?చట్ట ప్రకారం చర్యలు తీసుకోకపోతే ఇదే అలుసుగా ప్రభుత్వ ఆస్తులు అన్యాక్రాంతం అవ్వవా? అని ప్రజలే ఆలోచన చేయాలి. భూదాన్ భూములు వ్యవహారంలో అర్హులైన పేదలను గుర్తించాల్సిందిగా ఇప్పటికే జిల్లా కలెక్టర్ కు ఆదేశాలు జారీ చేశాను. పేదల గుర్తింపు వెరిఫికేషన్ ప్రక్రియ వేగంగా సాగుతుంది. ఇళ్ళు లేని పేదల గుర్తింపు పూర్తవగానే వారికి ఇళ్లు నిర్మాణం చేసేందుకు పది ఎకరాల ప్రభుత్వ స్థలం సిద్ధం చేయాలని కలెక్టర్ కు సూచించాను. పేదల సంఘం పేరుతో ఓ సంఘం చేసిన అరాచకం పై కమ్యూనిస్ట్ పార్టీలు వాస్తవాలు మాట్లాడారు. బాధ్యత లేని ప్రతిపక్ష బీ.ఆర్.ఎస్ మాత్రం పేదలను మోసం చేసిన వారిని కాపాడేలా హంగామా చేయడం రాజకీయ దిగజారుడుతనం అని మంత్రి తుమ్మల మండిపడ్డారు.

## ఎన్నికల కోడ్ ఉల్లంఘన కేసు

### నాంపల్లి కోర్టుకు హాజరైన సిఎం రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్, ఫిబ్రవరి 28 :** హైదరాబాద్‌లోని నాంపల్లి ప్రజా ప్రతినిధుల కోర్టుకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం హాజరయ్యారు. గతంలో నమోదైన ఎన్నికల కోడ్ ఉల్లంఘన, కోవిడ్ నిబంధనల ఉల్లంఘన కేసుల విచారణ నేపథ్యంలో న్యాయ మూర్తి ఎదుట ఆయన కోర్టులో హాజరై విచారణను ఎదుర్కొన్నారు. 2019లో జరిగిన హుజూర్‌నగర్ ఉప ఎన్నికల సమయంలో ఎన్నికల ప్రచారంలో భా గంగా, అప్పటి ఎంపీలైన రేవంత్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి తరఫున భారీ ర్యాలీ నిర్వహించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ ర్యాలీలో సుమారు 40 కార్లు, డీజే సౌండ్ సిస్టమ్‌లతో ప్రచారం నిర్వహించారని ఎన్నికల అధికారులు పేర్కొన్నారు. వారు ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారని ఆరోపిస్తూ ఎన్నికల అధికారులు తెలిపారు. ఇక 2021లో కరోనా మహమ్మారి సమయంలో తెలంగాణ ప్రభుత్వం విధించిన కోవిడ్ నిబంధనలను పాటించకుండా ఓ పబ్లిక్ మీటింగ్‌లో పాల్గొన్నారని కూడా రేవంత్‌రెడ్డిపై ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘటనకు సంబంధించి కూడా పోలీసులు కేసు నమోదు చేశారు. కోవిడ్ సమయంలో ప్రజా సమావేశాలపై పరిమితులు ఉన్నప్పటికీ వాటిని ఉల్లంఘించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ రెండు ఘటనలకు సంబంధించి ఎన్నికల సంఘం అధికారుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసులు నమోదు చేశారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘన, కోవిడ్ మార్గదర్శకాలు పాటించకపోవడం వంటి అంశాలపై కేసులు నమోదు చేశారు. ఈ కేసుల విచారణలో భాగంగా నాంపల్లి ప్రజా ప్రతినిధుల కోర్టు న్యాయమూర్తి ఎదుట సీఎం రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. కోర్టు విచారణలో తదుపరి విచారణ తేదీని నిర్ణయించే అవకాశం ఉంది. కేసుల విచారణ కొనసాగుతున్న నేపథ్యంలో రాజకీయంగా కూడా ఈ అంశం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రస్తుతం తెలంగాణ ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న రేవంత్ రెడ్డి కోర్టుకు హాజరుకావడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఎన్నికల సమయంలో జరిగిన ప్రచారం, కోవిడ్ సమయంలో జరిగిన సమావేశాలకు సంబంధించి చట్టపరమైన ప్రక్రియ కొనసాగుతున్నట్లు తెలుస్తోంది.



## 99 రోజుల యాక్షన్ ప్లాన్‌పై చర్చ

### అధికారులకు దిశానిర్దేశం చేసిన సిఎం

**హైదరాబాద్, ఫిబ్రవరి 28 :** సీఎం రేవంత్‌రెడ్డి శనివారం సచివాలయంలో వివిధ శాఖలకు చెందిన ప్రభుత్వ ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. 99 రోజుల యాక్షన్ ప్లాన్‌పై సమావేశంలో అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై సీఎం దిశానిర్దేశం చేశారు. మార్చి నుంచి జూన్ వరకు 99 రోజుల యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డి, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎంఓ అధికారులు పాల్గొన్నారు. ఇదిలావుంటే కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలంలో బాణసంచా తయారీ కేంద్రంలో భారీ పేలుడు ఘటనపై సిఎం దగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో మృతుల సంఖ్య 23కి చేరింది. మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## బాణాసంచా ప్రమాద ఘటనపై ప్రధాని దిగ్భ్రాంతి

### మృతులు కుటుంబాలకు 2లక్షల పరిహారం ప్రకటన

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28 :** కాకినాడ జిల్లా వేట్లపాలెంలో బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడు ఘటనపై ప్రధాని మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటన చాలా బాధాకరమన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు చెప్పారు. ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు రూ.2 లక్షలు, గాయపడిన వారికి రూ.50,000 పరిహారం ప్రకటించారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు.



## యాదగిరీశుడి సేవలో త్రిపుర గవర్నర్

**యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 28 :** యాదగిరిగుట్ట శ్రీలక్ష్మి నరసింహా స్వామి వారిని త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రా సేనా రెడ్డి దర్శించుకున్నారు. శనివారం ఉదయం కుటుంబసమేతంగా యాదగిరిగుట్టకు చేరుకున్న ఆయన.. వీవీఐపీ అతిథి గృహం నుంచి ప్రధానాలయంలోకి వెళ్లారు. ఆలయ ముఖ మండపం వద్ద ఆలయ ప్రధాన అర్చకులు ఆలయ సంప్రదాయ రీతిలో ఘన స్వాగతం పలికారు. అనంతరం గర్భాలయంలోకి తీసుకెళ్లి స్వయంభు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనం అనంతరం వారికి ప్రధానార్చక బృందం వేద ఆశీర్వచనం చేయగా.. ఏవో భవానీ స్వామి వారిప్రసాదాన్ని అందజేశారు.

## దేవాదాయశాఖలో ప్రతి సోమవారం ధర్మవాణి

### అంతర్గత సమస్యలపై ఫిర్యాదుల స్వీకరణ

**హైదరాబాద్, ఫిబ్రవరి 28 :** ఎండోమెంట్స్ కమిషనర్ శ్రీ హనుమంతరావు ఆదేశాల మేరకు తెలంగాణ దేవాదాయ ధర్మాదాయ శాఖలోని సమస్యల పరిష్కారార్థం ప్రత్యేక కార్యక్రమమైన 'ధర్మవాణి' కి శ్రీకారం చుట్టారు. శాఖలోని ఎవరైనా తమ సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుండి డైరెక్టర్ కార్యాలయంలో. ఉద్యోగులు, అర్చకులు లేదా ఇతరులు ఎవరైనా సరే డైరెక్టర్ గారిని కలవవచ్చని తెలిపారు. ఈ 'ధర్మవాణి' కార్యక్రమంలో ధర్మబద్ధమైన సమస్యలను తక్షణమే లేదా గరిష్టంగా వారం రోజులలో పరిష్కరిస్తామని తెలిపారు. శాఖ ప్రధాన కార్యాలయం, డీసీ, ఏసీ, ఈఓ కార్యాలయాల్లో చేయాల్సి ఉండి చేయని పనులు లేదా పెండింగ్‌లో ఉన్న సమస్యలను కూడా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దరఖాస్తు పరిష్కారమైన తర్వాత సంబంధిత వ్యక్తులకు కార్యాలయం నుండి సమాచారం అందజేస్తామని డైరెక్టర్ హనుమంతరావు తెలిపారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పరిష్కరించలేని సమస్యల విషయంలో ఎందుకు పరిష్కరించలేక పోయామో కూడా వివరంగా తెలియజేస్తామని తెలిపారు.

## రాష్ట్రంలో దెబ్బతిన్న శాంతిభద్రతలు

- ఎమ్మెల్యే కాటిపల్లికే రక్షణ లేకుండా పోయింది
- అసెంబ్లీలో కామారెడ్డి వ్యవహారంపై నిలదీస్తాం
- ఏలేటి మహేశ్వర్ రెడ్డి స్పష్టీకరణ



**కామారెడ్డి, ఫిబ్రవరి 28 :** తెలంగాణలో లా అండ్ ఆర్డర్ పూర్తిగా దెబ్బతిందని బీజేపీ శాసనసభ పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డికి భద్రత లేకుండా పోయిందని ఫైర్ అయ్యారు. సీఎం రేవంత్‌రెడ్డిని ఓడించి రమణారెడ్డి గెలవడం కాంగ్రెస్ కేడర్ జీర్ణించుకోలేక పోతున్నారని ధ్వజమెత్తారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బీజేఎల్పీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మహేశ్వర్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. రానున్న అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. ఎమ్మెల్యే ఇంటిపై దాడి చేసిన కాంగ్రెస్ నాయకులను అరెస్ట్ చేయకుండా బీజేపీ నాయకులను అరెస్ట్ చేయడం కక్ష సాధింపు కాదా అని మహేశ్వర్ రెడ్డి ప్రశ్నించారు. కామారెడ్డి, బాన్సువాడ, నాగర్‌కర్నూల్‌లో జరిగిన దాడికి సీఎం రేవంత్‌రెడ్డినే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో మెజార్టీ స్థానాలను బీజేపీ కైవసం చేసుకుందని తెలిపారు. ఎమ్మెల్యే రమణారెడ్డిని పరామర్శించడానికే బీజేపీ నాయకులు వస్తుంటే.. హౌస్ అరెస్ట్ చేయడం దారుణమని అన్నారు. ఆరు గ్యారెంటీలకు కాంగ్రెస్ సర్కార్ ఎందుకు చట్టబద్ధత కల్పించడం లేదని ప్రశ్నించారు. ఇచ్చిన హామీలను అమలు చేయనప్పుడు అధికారంలో ఉండే అర్హత కాంగ్రెస్‌కు లేదని మహేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. హోంశాఖను సీఎం రేవంత్‌రెడ్డి ఓవైసీ బ్రదర్స్‌కు తాకట్టు పెట్టారని ఆరోపించారు. బాన్సువాడలో ఓవైసీ బ్రదర్స్ చెప్పినట్లుగా రాష్ట్ర ప్రభుత్వం డ్రామాలు ఆడిందని దుయ్యబట్టారు. హిందూ యువతి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిని ఎందుకు రిమాండ్‌కు పంపలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. 13 మంది ఆర్ఎస్ఎస్ వాళ్లని అరెస్టు చేసి రిమాండ్‌కి పంపడం దారుణమని అన్నారు. రైతు బీమాను అమలు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. అసెంబ్లీలో రైతుల కోసం కొట్లాడతామని మహేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు.



## యుద్ధం వేళ పలు విమానాలకు ఆటంకం

**హైదరాబాద్, ఫిబ్రవరి 28 :** ఇరాన్–ఇజ్రాయిల్ మధ్య నెలకొన్న యుద్ధ పరిస్థితుల వల్ల శంషాబాద్ నుంచి వెళ్లాల్సిన పలు విమానాలు రద్దయ్యాయి. ఇప్పటికే 10 విమానాలు రద్దు కావడంతో ప్రయాణికులు నిరాశగా వెనుదిరిగారు. దేశంలో ఉన్న పలు ఎయిర్ పోర్ట్‌ల నుంచి ఇరాన్ ఇజ్రాయిల్ వెళ్ళే విమానాలు రద్దు కావడం గమనార్హం. ఇప్పటికే ఇరాన్, ఇజ్రాయిల్‌లో అన్ని ఎయిర్ పోర్ట్‌లు మూసివేశారు. ఇరాన్‌పై ఇజ్రాయెల్ ఆర్మీ దాడులు చేస్తుండగా.. ఖతార్, బెహ్రయిన్, కువైట్, యూఏఈలో ఉన్న అమెరికా ఫోర్సెస్‌పై ఇరాన్ మిస్సైల్స్‌తో విరుచుకుపడుతున్న పరిస్థితులున్నాయి. ఈ పరిస్థితుల్లో ఖతార్, కువైట్, యూఏఈ దేశాలు ఎయిర్ స్పేస్ ను క్లోజ్ చేశాయి. ఖతార్ రాజధాని నగరం దోహాలో పెద్ద ఎత్తున పేలుడు సంభవించింది. ఖతార్ డిఫెన్స్ మినిస్ట్రీ ఈ మిస్సైల్ అటాక్‌ను ధృవీకరించింది. ఇజ్రాయెల్ కూడాఎయిర్ స్పేస్‌ను క్లోజ్ చేసింది. టెల్ అవీవ్ ఎయిర్ పోర్ట్‌కు రాకపోకలు నిలిచిపోయాయి. మార్చి 7 వరకు ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్, లెబనాన్‌లోని బీరుట్, ఒమన్‌లకు విమానాలను నిలిపివేస్తున్నట్లు జర్మనీకి చెందిన విమానయాన సంస్థ లుఫ్తాన్సా తెలిపింది. శనివారం, ఆదివారం దుబాయ్‌కు బయలుదేరే విమానాలను కూడా ఈ ఎయిర్ లైన్ కంపెనీ నిలిపివేసింది. హంగేరీకి చెందిన తక్కువ ధర క్యారియర్ విజ్ ఎయిర్ సంస్థ.. మార్చి 7 వరకు ఇజ్రాయెల్, దుబాయ్, అబుదాబి, ఒమన్‌లకు బయలుదేరే అన్ని విమానాలను తక్షణమే నిలిపివేసింది.

## పశ్చిమాసియాకు విమనాలు నిలిపివేత

### ఎయిరిండియా, ఇండిగో సర్వీసుల రద్దు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28 :** ఇరాన్ లక్ష్యంగా ఇజ్రాయెల్–అమెరికా సంయుక్తంగా దాడులు జరుపుతుండటంతో పశ్చిమాసియా భగ్గుమంటోంది. ఇరాన్ సైతం ఇజ్రాయెల్‌తో పాటు పశ్చిమాసియాలోని అమెరికా స్థావరాలను లక్ష్యంగా చేసుకుని ప్రతిదాడులు జరుపుతోంది. ఈ నేపథ్యంలో ఇరాన్, ఇజ్రాయెల్‌కు పలు దేశాలు తమ విమాన సర్వీసులను రద్దు చేశాయి. పశ్చిమాసియాకు విమాన సర్వీసులను రద్దు చేస్తున్నట్టు ఇండిగో, ఎయిరిండియా ప్రకటించాయి. గల్ఫ్ ప్రాంతంలో పరిస్థితుల దృష్ట్యా ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ సర్వీసులను రద్దు చేసినట్టు ఆ సంస్థ ప్రతినిధి తెలిపారు. ప్రయాణికులు, సిబ్బంది భద్రత తమకు కీలకమని, పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని చెప్పారు. పశ్చిమాసియాకు విమాన సర్వీసులను రద్దు చేస్తున్నట్టు ప్రకటించిన విమానయాన సంస్థల్లో ఎయిర్ ఫ్రాన్స్, ఎయిరిండియా, బ్రిటిష్ ఎయిర్ వేస్, ఐబీరియా ఎక్స్‌ప్రెస్, ఇండిగో, జపాన్ ఎయిర్‌లైన్స్, ఎల్‌ఓటీ ఎయిర్‌లైన్స్, లుఫ్తాన్సా, నార్వేజియన్ ఎయిర్, టర్కిష్ ఎయిర్‌లైన్స్, వర్జిన్ అట్లాంటిక్, ఖతార్ ఎయిర్‌వేస్, ఎయిర్ అల్జీరియా, స్కాండేవియన్ ఎయిర్‌లైన్స్, విజ్ ఎయిర్ ఉన్నాయి. ఇరాన్ లక్ష్యంగా క్షిపణులు, బాంబులతో ఇజ్రాయెల్ శనివారంనాడు దాడులకు దిగింది. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో పలు ప్రాంతాలు పేలుళ్లతో దద్దరిల్లాయి. ముప్పును ముందస్తుగా నివారించేందుకు ఈ దాడులు జరిపినట్టు ఇజ్రాయెల్ ప్రకటించింది. ఆ వెంటనే అమెరికా–ఇజ్రాయెల్ సంయుక్తగా సైనిక చర్యకు దిగిట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ'గా తమ సైనిక చర్యను అమెరికా, 'ఆపరేషన్ రోరింగ్ లయన్'గా తమ సైనిక చర్యను ఇజ్రాయెల్ ప్రకటించుకున్నాయి. మరోవైపు, ఇజ్రాయెల్‌పై ఇరాన్ ప్రతీకార దాడులు చేపట్టింది. ఇజ్రాయెల్‌తో పాటు పశ్చిమాసియాలోని అమెరికా సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుంది. యూఏఈ, కువైట్, ఖతర్‌లలో పేలుళ్లు వినిపించినట్టు మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. తమదేశంలోని అమెరికా నేవీ 5వ ఫ్లీట్‌పై క్షిపణి దాడి జరిపినట్టు బహ్రెయిన్ ధ్రువీకరించింది. అయితే ఇరాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో బహ్రెయిన్ బేస్ నుంచి ఇప్పటికే తమ నౌకలను అమెరికా నేవీ ఉపసంహరించుకున్నట్టు తెలుస్తోంది.

## కోకాపేటలో జలమండలికి 3.95 ఎకరాల భూమి

- గ్రావిటీ ద్వారా నీటి సరఫరాకు నిర్మాణాలు
- హరీష్ రావు వ్యాఖ్యలపై ప్రభుత్వ వివరణ

**హైదరాబాద్, ఫిబ్రవరి 28 :** కోకాపేట్ నియోపోలిస్‌లోని శారదా పీఠం భూముల వ్యవహారంలో ప్రభుత్వంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపణలు సంధించారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. హరీశ్ రావు వ్యాఖ్యలపై ప్రభుత్వం శనివారం క్లారిటీ ఇచ్చింది. నియోపోలిస్‌లో జలమండలికి అదనంగా 3.95 ఎకరాల భూమి కేటాయింపు చేసినట్లు వివరించింది. ఇప్పటికే ఉన్న 8.75 ఎకరాలు ఎంబీఆర్, ఈఎల్ఎస్ఆర్ ల నిర్మాణానికే సరిపోతాయని స్పష్టం చేసింది. ఓహెచ్‌టీ, సైట్ ఆఫీస్, మెయింటెనెన్స్ కోసం అదనపు భూమి అవసరమని జలమండలి ప్రభుత్వాన్ని అభ్యర్థించిందని గుర్తు చేసింది. 592 మీటర్ల ఎత్తులో భూభాగం – గ్రావిటీ ద్వారా నీటి సరఫరాకు అనుకూలమని ప్రభుత్వం స్పష్టం చేసింది. పంపింగ్ అవసరం లేకుండా నియోపోలిస్, కోకాపేట్ ప్రాంతాలకు నీటి సరఫరా జరుగుతుందని స్పష్టత ఇచ్చింది. బోజగుట్ట రిజర్వాయర్‌కు గోదావరి జలాల గ్రావిటీ సరఫరా చేస్తామని వివరించారు. తద్వారా ఓల్డ్ సిటీ, షేక్‌పేట్, రెడ్ హిల్స్, మెహిదీ పట్నం ప్రాంతాలకు లాభం చేకూరుతుందని విశ్వాసం వ్యక్తం చేసింది. అంతేకాకుండా కరెంట్ ఛార్జీలు భారీగా ఆదా అవుతాయని ప్రభుత్వం వివరణ ఇచ్చింది. ఇక గోదావరి ఫేజ్– ప్రాజెక్ట్ ద్వారా అదనంగా 300 ఎంజిడి నీటి తరలింపు లక్ష్యంగా నిర్ణయించినట్లు ప్రభుత్వం వెల్లడించింది.

## చంద్రగిరి వద్ద రోడ్డు ప్రమాదం

### ప్రమాదంలో భార్యాభర్తలు మృతి

**తిరుపతి,ఫిబ్రవరి28 :** చంద్రగిరి మండలం మామండూరు దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదం కన్నీళ్లు తెప్పింది. రెండు కార్లు ఢీకొన్న యాక్సిడెంట్.. అత్యంత ఘోరంగా ఉంది. హైదరాబాద్ నుంచి అరుణాచలం వెళ్లి.. శివయ్య దర్శనం చేసుకుని తిరిగి మళ్లీ హైదరాబాద్ వస్తున్న క్రమంలో ఈ ప్రమాదం జరిగింది. మామండూరు జాతీయ రహదారిపై.. వేగంగా వెళుతున్న ఓ కారు.. ముందు వెళ్తున్న కారును ఢీకొట్టింది. ఆ సమయంలో హైదరాబాద్ కు చెందిన కారు పల్టీలు కొడుతూ.. రోడ్డుకు అవతలి వైపున పడింది. కారు పల్టీలు కొడుతూ వెళ్లటంతో.. కారులోని ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఇద్దరు చనిపోయారు. వీళ్లిద్దరూ భార్యభర్తలు. వీరిని అశోక్, చంద్రకళగా గుర్తించారు పోలీసులు. మిగతా నలుగురిని సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. వాళ్లకు గాయాలు తీవ్రంగా ఉన్నాయని డాక్టర్లు స్పష్టం చేశారు. అరుణాచలం నుంచి తిరిగి హైదరాబాద్ వెళుతున్న సమయంలో ఈ యాక్సిడెంట్ అయినట్లు చెబుతున్నారు గాయపడిన బాధితులు. యాక్సిడెంట్ స్పాట్ భయానకంగా ఉంది. పెద్ద కారు పల్టీలు కొడుతూ రోడ్డుకు అవతలివైపు పడటం అంటే.. కార్లు ఏ స్పీడ్ లో ఉన్నాయని తెలుస్తుందన్నారు పోలీసులు. మరో కారు ఢీకొనటం వల్ల ఈ యాక్సిడెంట్ అయ్యింది అంటున్నారు పోలీసులు. కేసు నమోదు చేసి.. తప్పు ఎవరిది అనేది తేలుస్తామని ప్రకటించారు పోలీసులు.

తొలిక్రాంతి

ఆదివారం
01 మార్చి 2026

# చెంపదెబ్బ.. గోడదెబ్బ!



**దేశంలో రెండు అసాధారణమైన కేసులు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. న్యాయవ్యవస్థ గట్టిగా నిలబడేలా తీసుకున్న చర్యలు ఇప్పుడు రాజకీయ నాయకుల కళ్లు తెరిపిస్తాయా లేదా అన్నది చూడాలి. ముందుగా ఢిల్లీ రౌజ్ అవెన్యూ కోర్టు లిక్కర్ స్కామ్‌పై ఇచ్చిన తీర్పు ఒకటయితే..ఎన్‌సిఇఆర్‌టి పుస్తకాల్లో న్యాయవ్యవస్థపై అచ్చేసిన పాఠ్యాంశం మరొకటి. ఈ రెండు కేసుల్లో న్యాయమూర్తులు ఇచ్చిన తీర్పులు లేదా ఆదేశాలు నేరుగా కేంద్రాన్ని ప్రశ్నించాయి. కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని నిలదీసాయి. ఇంతకన్నా ఘోరం మరోటి ఉండదు. ఎందుకంటే తమ చేతుల్లో ఉన్న అధికారాన్ని గుప్పిట పెట్టుకుని దర్యాప్తు సంస్థల ద్వారా లిక్కర్ కేసును అల్లిన తీరు చూస్తే ఇడి, సిబిఐల పరువు పోయింది. సిబిఐ అధికారిపై విచారణ చేయాలని ఢిల్లీ రౌజ్ అవెన్యూ కోర్టు జడ్జి చేసిన వ్యాఖ్యలు చూస్తే కేంద్రం సిగ్గుతో తలదించుకోవాలి. ఇక్కడ సిబిఐ ఇంత నిర్లక్ష్యంగా ఓ కేసులో ఛార్జిషీట్ దాఖలు చేసినందుకు బాధపడాలి. అంటే దాని ప్రతిష్టను అదే దిగజార్చుకుంది.**

కనీస సమాచారం, దానికి తగ్గ అవసరమైన సాక్ష్యాలు లేకుండా ఓ కేసును గాలిలో మేడలు కట్టినట్లుగా అల్లడం వెనక ఎంతటి నిర్లక్ష్యం ఉందో తెలియచేసింది. రాజ్యాంగ పదవిలో ఉన్న సిఎం కేజ్రీవాల్‌ను జైలులో పెట్టారు. ఉపముఖ్యమంత్రి సిసోడియాను జైలులో పెట్టారు. అంటే ఎంతటి దుర్మార్గానికి సిబిఐ, ఇడిలు ఒడిగట్టాయన్నది తేలిపోయింది. ఇదే విషయాన్ని జడ్జి ప్రశ్నించారు. నిజంగానే లిక్కర్ పాలసీ కేసు అన్నది ఓ అభూత కల్పన కేసు. అందులో ముడుపులు ముట్టాయనడానికి ఆధారాలు లేవు. ఈ కేసుతో సిబిఐ తన తీరును మార్చుకోవాలి. పక్కా సమాచారంతో కేసులను చేపట్టాలి. తద్వారా పోయిన ప్రతిష్టను ఇనుమడించేలా చేసుకోవాలి. ఇది సిబిఐ పరువే కాదు, దేశానికి సంబంధించి ప్రతిష్ట కూడా ఇందులో దాగి ఉంది. సిబిఐ సరిగా పనిచేస్తేనే, ప్రజలకు నమ్మిక ఉంటుంది. ఈ కేసులో ఆధారాలు ఉంటేనే హైకోర్టుకు వెళ్లడం మంచిది. అక్కడా భంగపడేకన్నా ఆధారాలు, సాక్ష్యాలను సేకరించాలి. ప్రాథమికి సమాచారం ఉంటేనే ముందుకు నడవాలి. రాజకీయ కక్షసాధింపులకు పాల్పడే కేసుల నుంచి సిబిఐ, ఇడిలలను దూరంగా ఉంచడం మంచిది. నిజానికి కెసిఆర్ హయాంలో జరిగిన అవినీతిపై కేసులు లేవు. జగన్ హయాంలో జరిగిన ఆర్థిక అవతవకతలపైనా కేసులు లేవు. ఇలాంటి వారి వల్ల ప్రజాధనం దుర్వినియోగం అయ్యింది. వీటిపై చర్యలు తీసుకుంటే రాష్ట్రాల్లో పాలకుల్లో భయం ఉంటుంది.

ఇకపోతే మరో కేసులో సుప్రీం చీఫ్ జస్టిస్ చేసిన వ్యాఖ్యలు కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఎత్తి చూపాయి. జాతీయ, విద్యా పరిశోధన, శిక్షణ మండలి ఎన్‌సిఇఆర్‌టి ప్రచురించిన ఎనిమిదో తరగతి సాంఘికశాస్త్రంలో 'కరప్షన్ ఇన్ ది జ్యూడిషియరీ' అనే పాఠ్యాంశం తీవ్ర వివాదమైంది. సుప్రీంకోర్టు ఈ అంశాన్ని సూమోటోగా విచారణకు తీసుకోవడమే గాక.. ఆ సందర్భంగా ఆగ్రహంతో స్పందించిన తీరు, సిజెఐ చేసిన వ్యాఖ్యలు దేశాన్ని కుదిపేశాయి. 'న్యాయవ్యవస్థ అధికారాన్ని అణచివేసేలా, గౌరవాన్ని కించపర్చేలా, ఉద్దేశ్య పూర్వకంగా చేసిన కుట్రగా ఇది కనిపిస్తోంది. దీనిని పట్టించుకోకుండా వదిలేస్తే ప్రజలు, యువత మనసుల్లో న్యాయవ్యవస్థ పవిత్రత దెబ్బతినే అవకాశం ఉంది.' అని విచారణ సందర్భంగా సిజెఐ అన్న వ్యాఖ్యలు అక్షర సత్యాలు. జవాబుదారీతనం ఏర్పడేంతవరకు ఈ వ్యవహారాన్ని మేం వదలిబెట్టం. దీని వెనుక ఎవరున్నారో మేం తెలుసుకోవాలనుకుంటున్నామని సిజెఐ అనడం చూస్తుంటే..ఎంతటి నిర్లక్ష్యం ఉందో తేటతెల్లం అయ్యింది. ఈ వ్యవహారంతో కేంద్ర ప్రభుత్వం అత్యున్నత న్యాయస్థానానికి బేషరతుగా క్షమాపణలు చెప్పవలసి వచ్చింది. ఆ చాప్టర్లను ఇద్దరు వ్యక్తులు రూపొందించారని, వారు యుజిసి లేదా మరే మంత్రిత్వ శాఖతోనూ కలిసి పనిచేయడం లేదని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వివరణ ఇచ్చారు.

ఆ పాఠ్యాంశాన్ని ముద్రించిన ఎనిమిదో తరగతి సాంఘిక శాస్త్రం పాఠ్యపుస్తకాన్ని పూర్తిగా నిషేధిం చాలని, ఇప్పటికే ప్రచురితమైన పుస్తకాలను వెనక్కి తీసుకోవాలని ధర్మాసనం ఆదేశించడం ద్వారా ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని గట్టిగా నిలదీసినట్లు అయ్యింది. అయితే 8వ తరగతి పాఠ్యాంశం వంటిది హఠాత్పరిణామం కాదు. గత దశాబ్ద కాలంగా ఎన్‌సిఇఆర్‌టి, ఇతర కేంద్ర ప్రభుత్వ పరిధిలోని సంస్థల చర్యలు తరచు వివాదాస్పదంగా మారుతున్న విషయం అందరికీ తెలిసిందే! పాఠ్యాంశాల్లో కొన్ని తొలగింపులు, అర్థరహిత మైన చేర్పులతో మీడియాలో పతాక శీర్షికల్లో వస్తూనే ఉన్నాయి. ఆయా సందర్భాల్లో చరిత్రకారులు, సామాజిక శాస్త్రవేత్తలూ వాటిని ఎత్తిజూపి ప్రజలు, ప్రభుత్వ దృష్టికి తీసుకొస్తున్నారు. ఇప్పుడు నేరుగా న్యాయ వ్యవస్థనే టార్గెట్ చేయడం, సుప్రీం ధర్మాగ్రహంతో కేంద్రం ఆత్మరక్షణలో పడింది. నేరుగా ప్రధానమంత్రి కార్యాలయమే రంగంలోకి దిగి నష్ట నివారణ చర్యలు చేపట్టవలసి వచ్చింది. ఈ రెండు వ్యవహారాల్లో కేంద్రం నేరుగా దొరికి పోయింది. కేజ్రీవాల్‌ను అణచివేసే కుట్ర జరిగిందన్న ఇక్కడ తెలిసిపోయింది. అన్నా హజారే చేపట్టిన అవినీతి వ్యతిరేక ఉద్యమంలో పుట్టుకుని వచ్చిన కేజ్రీవాల్ ఢిల్లీ ముఖ్యమంత్రి అయ్యారు. పంజాబ్‌లో పాగా వేశారు. దేశంలో అనేక చోట్ల ఉనికి చాటుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలో ఆయనను అవినీతి ముద్రతో అణివేసే ప్రయత్నం జరిగిందన్న వాదనలు వచ్చాయి. తెలంగాణలో కెసిఆర్ తనయ కవితను కూడా ఇందులో చేర్చారు. నిజానికి ఈ కేసు బలంగా ఉంటే కోర్టు ఇంత తీవ్రంగా వ్యాఖ్యలు చేసివుండేది కాదు. రాజకీయంగా తీసుకునే నిర్ణయాలకు సిబిఐ, ఇటి లాంటి వ్యవస్థలను దుర్వినయోగం చేయడం తగదు. ఇప్పటికైనా కేంద్రం తగు జాగ్రత్తలు తీసుకుని ప్రజలకు మేలుజరిగే మంచి పనులపై దృష్టి సారించాలి. అక్రమార్కులపై ఉక్కుపాదం మోపాలి. అందుకు సమర్థవంతులైన అధికారులను నియమించుకోవాలి.

# పెరిగిన మిర్చి ధర

- క్వింటాకు గరిష్టంగా రూ.18,789 ధర
- రైతుల్లో ఆనందం
- గతంలో ఎప్పడూ లేనంతగా పెరిగినట్లు వెల్లడి



**వరంగల్, ఫిబ్రవరి 28 :** మిర్చి రైతులకు మళ్లీ చాలాకాలం తరవాత మద్దతు ధరలను మించి ధరలు దక్కుతున్నాయి. ఆలస్యంగా అయినా ధరలు దక్కడంపై రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వరంగల్ చుట్టుపక్కల రైతులు మిర్చిని నాణ్యతతో పండిస్తున్నట్లు వెల్లడించారు. వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో చపాట దేశీ మిర్చి ధరలు పెరిగాయి. నాలుగు సంవత్సరాల తరువాత దేశీ మిర్చి ధరలు పుంజుకున్నాయని రైతులు అన్నారు. ఈ-నామ్ విధానంలోని ఈ-వేలంలో వ్యాపారులు క్వింటాకు గరిష్టంగా రూ.18,789, కనిష్టంగా రూ.17,521, సగటున రూ.18,489 ధరల చొప్పున ఖరీదులు చేశారు. మార్కెట్‌లో ఈ నెల మొదటివారంలో మిర్చి సీజన్ ప్రారంభం కాగా, తొలుత క్వింటాకు రూ.16,300 నుంచి రూ.16,800 వరకే సగటు ధరలు ఉన్నాయి. మార్కెట్‌కు వరుస సెలవుల అనంతరం ఈనెల 18న సగటు ధర రూ.17,011ఉండగా క్రమంగా పెరుగుతూ తాజాగా రూ.18,489కి చేరింది. ఖమ్మం, వరంగల్ మార్కెట్ల రాబడులు, కోల్డ్ స్టోరేజీల్లో ఉన్న నిల్వలు, ఇతర దేశాల ఎగుమతుల అంశాలన్నీ ఇక్కడి మిర్చి ధరలను ప్రభావితం చేస్తున్నట్లు వ్యాపారులు విశ్లేషిస్తున్నారు. 2021-22లో మిర్చి ధరలు, ముఖ్యంగా దేశీ మిర్చి ధర క్వింటాకు లక్ష రూపాయల వరకు పలికింది. ఆ తరువాత గడిచిన నాలుగేళ్లుగా రూ.30వేల నుంచి రూ.40 వేలు.. తేజ, వండర్‌హాట్, యూఎస్ 341 లాంటి రకాలకు రూ.12వేల నుంచి రూ.16వేలు పలికాయి. దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందారు. అనేక మంది రైతులు మిర్చి బస్తాలను కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసుకున్నారు. ప్రస్తుత సీజన్‌లో కొంత కాలంగా ధరలు పెరుగుతూ వస్తున్నాయి. శుక్రవారం వరంగల్ వ్యవసాయ మార్కెట్లో దేశీ మిర్చి క్వింటాకు రూ.50 వేలు పలికింది. జియో ట్యాగింగ్ కలిగిన దేశీ మిర్చికి విదేశాలలో మంచి డిమాండ్ ఉండడంతో ఎగుమతులు చేసేందుకు వ్యాపారులు ఆసక్తి చూపుతున్నారు. కాగా, వరంగల్ వ్యవసాయ మార్కెట్లో శుక్రవారం మిర్చి ధరలు గరిష్ఠంగా క్వింటాకు ఈ విధంగా ఉన్నాయి. తేజ - రూ.18,700, వండర్‌హాట్ - రూ.36వేలు, దీపిక రూ.30 వేలు, యూఎస్ 341 - రూ.22.100, ఎల్లో మిర్చి (తేజ) రూ.23 వేలు, తాలు మిర్చి రూ.12వేలు ధర పలికాయి. కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌కు శుక్రవారం 45 మంది రైతులు 495 బస్తాల్లో తేజరకం మిర్చి విక్రయానికి తీసుకువచ్చారు.

## మెదక్ మాజీ మున్సిపల్ చైర్మన్
# మల్లికార్జున్ గౌడ్‌పై కక్షసాధింపు

**మాజీ మంత్రి హరీశ్ రావు**



**హైదరాబాద్, ఫిబ్రవరి 28 :** మెదక్ మాజీ మున్సిపల్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తూ వరుసగా అక్రమ కేసులు బనాయించి అరెస్ట్ చేయడాన్ని మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రంగా ఖండించారు. బీఆర్ఎస్ నాయకులను, కార్యకర్తలను రాజకీయంగా ఎదుర్కోలేక.. పోలీసులను అడ్డం పెట్టుకుని కాంగ్రెస్ నాయకులు ఇలాంటి దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆయన మండిపడ్డారు. మున్సిపల్ ఎన్నికల సమయం నుంచి మల్లికార్జున్ గౌడ్‌పై కాంగ్రెస్ నాయకులు కక్షకట్టారని, ఇప్పటికే ఆయనపై నాలుగు తప్పుడు కేసులు పెట్టారని ఆ కేసుల్లో ఆయనకు హైకోర్టు స్టే ఇచ్చినా ఎలాగైనా జైలుకు పంపాలన్న దురుద్దేశంతో వెంటనే మరో కొత్త అక్రమ కేసు పెట్టి పోలీసులు అరెస్ట్ చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ దౌర్జన్యానికి నిదర్శనమని హరీశ్‌రావు అన్నారు. అధికార పార్టీ నాయకులకు కొమ్ముకాస్తూ చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తున్న పోలీసుల తీరు మారాలని మల్లికార్జున్ గౌడ్‌ను తక్షణమే బేషరతుగా విడుదల చేయాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. అక్రమ కేసులతో ఇబ్బంది పడుతున్న ప్రతి కార్యకర్తకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

# మున్సిపల్ ఎన్నికల కేసు

**మాజీ చైర్మన్ మల్లికార్జున గౌడ్ అరెస్ట్**

**మెదక్, ఫిబ్రవరి 28 :** మెదక్ మాజీ మున్సిపల్ చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు మల్లికార్జున గౌడ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. మున్సిపల్ ఎన్నికల మసయంలో కాంగ్రెస్ నాయకులతో పాటు ఎమ్మెల్యేపై దాడి చేసి, హత్యకు యత్నించారని ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో ఇప్పటికే 13 మంది బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేసి సంగారెడ్డి జైలులో ఉంచగా.. తాజాగా మల్లికార్జున గౌడ్‌ను అరెస్టు చేయడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. మెదక్ పట్టణంలోని మల్లికార్జున గౌడ్ నివాసానికి శనివారం తెల్లవారుజామున భారీగా పోలీసులు మోహరించారు. ఇంట్లోకి వెళ్లి ఆయన్ను అరెస్టు చేశారు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు పెద్ద ఎత్తున మల్లికార్జున గౌడ్ నివాసానికి చేరుకున్నారు. బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు పెడుతూ అరెస్టులు చేస్తున్నారని ఈ సందర్భంగా వారు మండిపడ్డారు. దీంతో అక్కడ పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈ క్రమంలో మల్లికార్జున రెడ్డిని అరెస్టు చేసి మెదక్ రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

## లండన్ అగ్నిప్రమాదంలో నిజామాబాద్ యువకుడు మృతి

**నిజామాబాద్, ఫిబ్రవరి 28 :** లండన్‌లోని క్రొయిడాన్ ప్రాంతంలో మూడు రోజుల క్రితం జరిగిన అగ్ని ప్రమాదంలో ఎపి కి చెందిన గొంతి అభిషేక్ ప్రాణాలు కోల్పోగా, తీవ్ర గాయాలపాలై చికిత్స పొందుతున్న నిజామాబాద్‌కు చెందిన సాయి శ్రీకర్‌ను వైద్యులు బ్రెయిన్ డెడ్‌గా నిర్ధారించారు. ఒకే రూమ్‌లో ఉంటున్న వీరు ఎంబీఏ పూర్తిచేసి పార్ట్‌టైమ్ ఉద్యోగం చేస్తున్నట్లు సమాచారం. అయితే, ఈ అగ్నిప్రమాదం నుంచి తప్పించుకున్న మరో విద్యార్థి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు సమాచారం. లండన్ డుప్పాస్ హిల్స్ టెర్రాస్‌లోని రెండు అంతస్తుల నివాసంలో రెండు రోజుల క్రితం గ్యాస్ లీకై మంటలు చెలరేగాయి. గ్రౌండ్ ఫ్లోర్ నుంచి మొదటి అంతస్తుకు మంటలు, దట్టమైన పొగ వ్యాపించడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ దుర్ఘటనలో ఇద్దరు యువకులు ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో సాయి శ్రీకర్ అవయవాలను దానం చేసేందుకు అంగీకరించినట్లు నిజామాబాద్‌లోని శ్రీనగర్ కాలనీలో నివాసముంటున్న అతడి తల్లిదండ్రులు వెల్లడించారు.

దేశవ్యాప్తంగా హెచ్‌పివి వేక్సినేషన్
## చీపురుపల్లి సిహెచ్‌సిలో ప్రారంభించిన చంద్రబాబు

**విజయనగరం, ఫిబ్రవరి 28 :** దేశవ్యాప్తంగా హెచ్‌పివి వేక్సినేషన్ జరుగుతోన్న వేళ ఎపి రాష్ట్రంలోనూ టీకా కార్యక్రమం కొనసాగుతోంది. శనివారం విజయనగరం జిల్లాలోని చీపురుపల్లి సిహెచ్‌సిలో హెచ్‌పివి వేక్సినేషన్ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ ..గర్భాశయ కేన్సర్ రాకుండా బాలికలు ఈ వ్యాక్సిన్స్ వేసుకోవాలని పిలుపునిచ్చారు. ఒకసారి వ్యాక్సిన్ వేసుకుంటే జీవితాంతం రక్షణ ఉంటుందని చెప్పారు. బాలికలు, వారి తల్లితండ్రులతో మాట్లాడి యోగక్షేమాలను తెలుసుకున్నారు. చీపురుపల్లి సిహెచ్‌సి పరిశుభ్రంగా ఉందని సిఎం అభినందించారు. ఈ కార్యక్రమంలో హోం మంత్రి అనిత, వైద్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, కలెక్టర్ రామ్ సుందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## జ్యుడిషియల్ అకాడమీకి నేడు శంకుస్థాపన

**అమరావతి, ఫిబ్రవరి 28 :** రాజధాని అమరావతిలో ఆదివారం జ్యుడీషియల్ అకాడమీ నిర్మాణానికి సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ శంకుస్థాపన చేయనున్నారు. తుళ్లూరు మండలం దొండపాడు సమీపంలోని ఈ-4,ఎన్16 జంక్షన్ వద్ద 6.5 ఎకరాల్లో రూ165 కోట్ల వ్యయంతో జుడీషియల్ అకాడమీ నిర్మాణం జరగనుంది. ప్రస్తుతం మంగళగిరిలోని అద్దె భవనంలో జ్యుడీషియల్ అకాడమీ కొనసాగుతోంది. హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాగూర్,సీఎం చంద్రబాబు, గవర్నర్ అబ్దుల్ నజీర్, ఇతరులు హాజరుకానున్నారు. అకాడమీ శంకుస్థాపనకు సంబంధించిన ఏర్పాట్లలో ప్రభుత్వం యంత్రాంగం నిమగ్నమైంది.

## మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య

**వికారాబాద్, ఫిబ్రవరి 28 :** వికారాబాద్‌లో విషాదం నెలకొంది. పట్టణంలోని గంగారాం సాయి బాబా కాలనీలో మహిళా కానిస్టేబుల్ బలిజ దివ్య ఆత్మహత్య చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. సాయిబాబా కాలనీకి చెందిన బసవరాజ్ హోంగార్డుగా పనిచేసి ఆరేళ్ల క్రితం మరణించాడు. అతని మూడో కుమార్తె బలిజ దివ్య 2020వ బ్యాచ్‌కు చెందిన కానిస్టేబుల్. గత ఐదేళ్లుగా వికారాబాద్ జిల్లా ధారూర్ పోలీస్ స్టేషన్‌లో ఆమె విధులు నిర్వహిస్తున్నారు. ఇదిలా ఉంటే శనివారం తెల్లవారుజామున తన నివాసంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బలిజ దివ్య మృతదేహం వద్ద ఒక సూసైడ్ లెటర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అందులో ప్రియ-మైన అమ్మ, నా కుటుంబసభ్యులు నేను ఇటువంటి నిర్ణయం తీసుకున్నందుకు నన్ను క్షమించండి. నా చావుకు ఎవరు కారణం కాదు. మెంటల్ స్ట్రెస్ తట్టుకోలేక ఈ రాంగ్ స్టెప్ తీసుకుంటున్నా. అమ్మా.. నీకు నేను భారం కాకూడదని ఈ నిర్ణయం తీసుకున్నా. నాన్న ఉంటే బాగుండే అమ్మ. నాన్న లేనందుకే నీకు ఇన్ని కష్టాలు. నన్ను క్షమించు అమ్మా' అని అందులో రాసి ఉంది. కాగా, ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. బలిజ దివ్య ఆత్మహత్యకు గల కారణాలపై ఆరా తీస్తున్నారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## తల్లిపై దారుణంగా దాడి
**బతికుండగానే సజీవ దహనం**

**నిజామాబాద్, ఫిబ్రవరి 28 :** నిజామాబాద్ జిల్లాలోని కోటగిరిలో దారుణ ఘటన చోటుచేసుకుంది. వృద్ధురాలైన తన కన్నతల్లిని మద్యానికి బానిసైన ఓ కొడుకు సజీవ దహనం చేశాడు. కోటగిరికి చెందిన భూమవ్వ కొడుకు మద్యానికి బానిసై రోజూ డబ్బుల కోసం తల్లిని వేధించేవాడు. ఈ క్రమంలో శనివారం కూడా డబ్బుల కోసం భూమవ్వతో గొడవపడ్డాడు. ఆమె తన దగ్గర డబ్బులు లేవని చెప్పడంతో దాడి చేసి చంపాడు. తల్లిపై ఇంట్లోని పాత దుస్తులు వేసి నిప్పంటించాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## తిరుపతి ఎస్వీ జూపార్క్‌కు అరుదైన వన్యప్రాణులు

**పరస్పర మార్పిడితో జంతువుల రాక**

**తిరుపతి, ఫిబ్రవరి 28 :** తిరుపతి ఎస్వీ జూపార్కుకు త్వరలో అరుదైన వన్యప్రాణులు రానున్నాయి. విశాఖ జూపార్కు, హైదరాబాదు జూపార్కు, చెన్నైలోని క్రొకోడైల్ బ్యాంకు ట్రస్టు, గుజరాత్ రాష్ట్రం జాంనగర్‌లోని గ్రీన్స్ జువాజికల్ రెస్క్యూ అండ్ రిహాబిటేషన్ సెంటర్ నుంచి మొత్తం 61 వన్యప్రాణులు తిరుపతికి రానున్నాయి. పరస్పర వన్యప్రాణి మార్పిడి విధానం ద్వారా వీటిని తెప్పించనున్నట్లు ఇక్కడి జూ అధికారులు చెప్పారు. తిరుపతినుంచి గరియల్-2, ఇండినగ్ గౌడ్-2, జపనీస్ కోయల్ -4, మస్కోవి డక్ -4, గే పిలికాన్ -2, వైటఖ్ ఈబీస్ 2 హైదరాబాద్ లోని నెహ్రూ జులాజికల్ పార్కుకు పంపిస్తారు. అక్కడినుంచి మగ్గర్ క్రొకోడైల్స్ -4, ఇండియన్ మౌస్ డీర్-6, రింగ్ నెక్కుడ్ పీసెంట్ -2, గో÷-డలెన్ పీసెంట్-2, సిల్వర్ పీసెంట్ -1, రెడ్ జంగిల్ ఫోవల్ -2, జంధ్యాకోనూరే 2 ఇక్కడికి రానున్నాయి. మద్రాస్ క్రొకోడైల్ బ్యాంకు ట్రస్టు నుంచి మొసళ్లు-5, ఉప్పునీటి మొసళ్లు 2, ఎల్లో అనకొండ-9 ఎస్వీ జూపార్కుకు రానున్నాయి. విశాఖలోని ఇందిరా గాంధీ జువాజికల్ పార్కు నుంచి ఒక తెల్లపులి ఎస్వీ జూపార్కుకు రానుండగా ఇక్కడున్న తెల్లపులిని వారికి పంపిస్తారు. రెండు అడవికుక్కలు, ఒక తోడేలు, రెండు జింకలు, బూడిదరంగు అడవికోళ్లు రెండు విశాఖ జూకు పంపించనున్నారు. దానికి బదులుగా అక్కడి నుంచి ఒక తోడేలు, రెండు అడవికుక్కలు, రెండు అడవిపిల్లులు, రెండు నీల్‌గై, నాలుగు గ్రీన్ ఇగ్వనాలను తిరుపతి జూపార్కుకు అందజేయనున్నారు. జామ్‌నగర్‌కు తెల్లపులి ఒకటి, ఇండియన్ గౌర్ రెండు, బ్లాక్ బక్-10, సాంబార్-10, బార్కింగ్ డీర్-2, మస్కోడక్-2, జాగ్వర్ ఒకటి అందజేస్తారు. దీనికి బదులుగా జీబ్రాలు 4, బ్లాక్ పాంథర్ రెండు, జిరాఫీలు రెండు, జాగ్వార్లు రెండు, రెడ్ నెక్కుడు వాలాబీ నాలుగు తిరుపతి ఎస్వీ జూపార్కుకు అందజేస్తారు.



## ఏపీలో జోరుగా పెన్షన్ల పంపిణీ

- విజయనగరంలో సిఎం చంద్రబాబు హాజరు
- పాలకొల్లులో మంత్రి నిమ్మల పంపిణీ

**అమరావతి, ఫిబ్రవరి 28 :** ఏపీలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ శరవేగంగా సాగుతోంది. మార్చి1 ఆదివారం సెలవు కావడంతో ఒకరోజు ముందుగానే అంటే శనివారం పింఛన్లను పంపిణీ చేపట్టారు. ఉదయం 11 గంటల నాటికి సుమారు 82 శాతం మేర పింఛన్లు అందజేశారు. ప్రభుత్వం 62.76 లక్షల మంది లబ్దిదారులకు రూ. 2,725 కోట్లు విడుదల చేసింది. ఇప్పటి వరకు 51.86 లక్షల మందికి పింఛన్లు పంపిణీ అయ్యాయి. స్వర్ణవార్డు, స్వర్ణగ్రామ సిబ్బంది.. లబ్దిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి నగదుగా అందజేస్తున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజయనగరం జిల్లా చీపురుపల్లి నియోజకవర్గం రావివలస గ్రామంలో అక్కడ లబ్దిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేపట్టారు. మరోవైపు పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో మంత్రి నిమ్మల రామానాయుడు పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు. వృద్ధురాలికి పింఛన్ అందజేసి ఆమె యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ.. అసెంబ్లీ సమావేశాలకు జగన్ మోహన్ రెడ్డి, వైసీపీ ఎమ్మెల్యేలు ముఖం చాటేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు. అసెంబ్లీ నుంచి ఎస్కేప్, శాసనమండలికి వాకౌట్, రోడ్డుపై రప్పా రప్పా సంస్కృతి వైసీపీదని విమర్శించారు. 2029లో అధికారంలోకి వస్తే రాక్షసత్వం ప్రదర్శిస్తామన్న వైసీపీ వ్యాఖ్యలను మంత్రి ఖండించారు. మానవ త్వంతో పనిచేసే కూటమి ప్రభుత్వమా లేక రాక్షసత్వం గల వైసీపీనా అని ప్రజలు తేడా బేరీజు వేసుకోవాలన్నారు. పురాణకాలంలో యజ్ఞాలను అడ్డుకున్న రాక్షసుల్లా నేడు అభివృద్ధిని, మంచి కార్యక్రమాలను అడ్డుకునే దుష్టశక్తిగా వైసీపీ తయారైందంటూ మంత్రి నిమ్మల రామానాయుడు వ్యాఖ్యలు చేశారు.



## ఘనంగా మట్టా సత్యనారాయణ వర్ధంతి

**దమ్మపేట, ఫిబ్రవరి 28:** మండల పరిధిలోని మొద్దలగూడెం గ్రామంలో సిపిఎం పార్టీ నాయకులు అమరజీవి కామ్రేడ్ మట్టా సత్యనారాయణ 26వ వర్ధంతి మాజీ జిల్లా కమిటీ సభ్యులు దొడాఢ లక్ష్మి నారాయణ అధ్యక్షతన శనివారం జరిగింది. ముందుగా మట్టా సత్యనారాయణ స్మారక స్థూపం వద్ద పార్టీ జెండాను గ్రామ శాఖ కార్యదర్శి చెన్నుబోయిన బ్రహ్మయ్య ఎగురవేశారు. అనంతరం సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలను పార్టీ మండల కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా దొడ్డ లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగిన సభలో మోరంపూడి శ్రీనివాసరావు, దొడ్డ లక్ష్మీనారాయణలు మాట్లాడుతూ, అమరజీవి కామ్రేడ్ మట్టా సత్యనారాయణ జీవితాంతం ఎర్ర జెండా పట్టుకుని పేదల కోసం, కష్టజీవులు కోసం, వారి సమస్యలపై మిలిటెంట్ పోరాటాలు నిర్వహించారని, ఈ ప్రాంతంలో మార్క్సిస్టు పార్టీ అభివృద్ధి కోసం ఎనలేని కృషి చేశారని కొనియాడారు. ప్రపంచంలోనే మహత్తరమైన కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని నమ్మి ఎర్రజెండాను ఎత్తుకొని తన ప్రాణం ఉన్నంతకాలం పని చేశారని, వారు వున్నంతకాలం పేద ప్రజలలో మమేకమై వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పనిచేసి పేద ప్రజల మనిషి అని గుర్తింపు పొందిన మహానుభావుడని, నిజమైన కమ్యూనిస్టు జీవితాన్ని గడిపారని, వారి ఆశయాలతో మనం పని చేయాలని మట్టా సత్యనారాయణకి ఘనమైన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ సభ్యులు కూచిపూడి రవి, ఎస్కే నభి, గుండు రామ్మూర్తి, సత్యనారాయణ కుటుంబ సభ్యులు మట్టా స్టాలిన్, చంద్రశేఖర్, ఓబెళ్ళనేని గోపాలరావు, మనుమరాళ్ళు సాధ్వి, బౌవ్య, కూచిపూడి నాగ వెంకట సతీష్, గ్రామ పెద్దలు దొడ్డా చిన్న సత్యనారాయణ, సోయం వెంకన్న బాబు తదితరులు పాల్గొన్నారు.



### కాక వారి వివాహ వేడుకకు
## హాజరైన మాజీ జడ్పీటీసీ పైడి

**దమ్మపేట, ఫిబ్రవరి 28:** మండల పరిధిలోని అంకంపాలెం గ్రామానికి చెందిన కాక శ్రీనివాసరావు, వెంకటమ్మ దంపతుల కుమారుడు దేవేంద్ర ప్రసాద్ వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను మాజీ జడ్పిటిసి పైడి వెంకటేశ్వరావు ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అంకంపాలెం సర్పంచ్ మెకాళ్ళ గురు మూర్తి, కాకా బలరాం కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.




## అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి

**సీఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్**

**దమ్మపేట, ఫిబ్రవరి 28:** అంగన్వాడి కేంద్రాల పర్యవేక్షణ బాధ్యతలను స్థానిక సర్పంచులకు అప్పగించరాదని, అంగన్వాడీల కు నెలనెలా వేతనాలు అందించాలని, కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని సీఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ డిమాండ్ చేశారు. మొద్దులగూడెం, తాటి సుబ్బన్న గూడెం గ్రామ సమన్వయ కమిటీ సమావేశం శ్రీదేవి అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సందర్భంగా అర్జున్ మాట్లాడుతూ అంగన్వాడీల కేంద్రాల పర్యవేక్షణ బాధ్యతలు స్థానిక సర్పంచుల చేతులలో పెట్టడం అంటే అంగన్వాడీలను ఐసిడిఎస్ ఉద్యోగులను అవమానపరచడమేనని అన్నారు. గ్రామ పంచాయతీల పెత్తనం కిందికి వెళితే రాజకీయ వత్తిడి, తమకు నచ్చని వారి పై కక్ష సాధింపు చర్యలు పాల్పడే అవకాశం ఉందని అన్నారు. గ్రామాల్లో అంగన్వాడీ ఉద్యోగులు చాలీచాలని వేతనాలతో సక్రమంగా సమయానికి జీతాలు రాకపోయినా కొన్ని దశాబ్దాలుగా పసిపిల్లలకు బాలింతలకు గర్భిణీలకు పౌష్టికాహారం అందిస్తున్నారని, అటువంటి ఐసిడిఎస్ శాఖను ప్రభుత్వం బాధ్యత నుంచి తప్పుకొని రాజకీయ జోక్యం పెరిగే విధంగా చేయకూడదని అన్నారు. అంగన్వాడీలు తమ సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వం ముందు తమ సమస్యలను పెడితే వాటిని పట్టించుకోకుండా నూతన విద్యా విధానం ముందుకు తెస్తూ ఆన్లైన్ క్లాసులు పెడతామని అంటుందని, మారుమూల గ్రామాలలో నెట్ సౌకర్యం, అంగన్వాడీల దగ్గర సరైన సెల్ఫోన్ సౌకర్యాలు లేనప్పుడు క్లాసులు ఎలా విని అర్థం చేసుకుంటారని అన్నారు. అంగన్వాడి కేంద్రాల్లో ఖాళీగా ఉన్న ఆయా టీచర్ పోస్టులు భర్తీ చేయాలని, అవసరమైన చోట్ల అంగన్వాడి కేంద్రాలను నిర్మించాలని, పెండింగ్ వేతనాలు టి ఎ డి ఎ లు విడుదల చేయాలని, పదవి విరమణ చేసిన అంగన్వాడీ టీచర్లు ఆయాలకు పెండింగ్ గ్రాడ్యుటి అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కవిత, ఝాన్సీ, సోమమ్మ, సిఐటియు నాయకులు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## దమ్మపేట పంచాయతీ కార్యదర్శిగా బండి అనంతకుమార్

**దమ్మపేట, ఫిబ్రవరి 28:** అశ్వారావుపేట నియోజకవర్గం లోనే మేజర్ పంచాయతీ అయిన దమ్మపేట కు నూతన పంచాయతీ కార్యదర్శి గా బండి అనంత కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యదర్శి బండి అనంతకుమార్ సర్పంచ్ పగడాల రమాదేవి రాంబాబు లను మర్యాద పూర్వకంగా కలిసారు.

# ముందుకు అశ్వారావుపేట

- అభివృద్ధికి వేగం
- గ్రామాలకు పునాది పనులు
- ప్రజలకు హామీ మాట



**ములకలపల్లి, ఫిబ్రవరి 28:** అశ్వారావుపేట నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో ముందుంచేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అన్నారు. ములకలపల్లి మండలంలోని పలు గ్రామాల్లో ఆయన విస్తృతంగా పర్యటిస్తూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గ్రామీణ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని విద్య, మహిళా సాధికారత, వ్యవసాయం, మత్స్యరంగాలకు సంబంధించిన పలు పనులకు శంకుస్థాపనలు చేసి లబ్ధిదారులకు ఆర్థిక సహాయం చెక్కులు అందజేశారు. పాతగంగారం గ్రామంలో డ్వాక్రా మహిళల కోసం కమ్యూనిటీ భవనం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అదే గ్రామంలో ప్రాథమిక పాఠశాల కొత్త భవనం నిర్మాణానికి పునాది వేసి విద్యాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యా సౌకర్యాలు మెరుగుపడితేనే భవిష్యత్తు తరాలు అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. జగన్నాథపురం రైతు వేదికలో కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మూకమామిడి గ్రామంలో జరిగిన గ్రామసభలో పాల్గొని ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. గ్రామాల అభివృద్ధికి అవసరమైన పనులను దశలవారీగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. చౌటిగూడెం గ్రామంలో డ్వాక్రా మహిళల కమ్యూనిటీ భవనానికి శంకుస్థాపన చేశారు. అనంతరం టీడబ్ల్యూఆర్ పాఠశాలకు ప్రహరీ గోడ నిర్మాణానికి పునాది వేశారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో చేపల పెంపకం కేంద్రాన్ని ప్రారంభించి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యమని తెలిపారు. పొగళ్లపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రహరీ గోడ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అక్కడే కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల చెక్కులు పంపిణీ చేశారు. తిమ్మంపేట గ్రామంలో డ్వాక్రా మహిళల కమ్యూనిటీ భవన నిర్మాణానికి పునాది వేశారు. ములకలపల్లి మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు అందజేశారు. అదే ప్రాంతంలో పౌల్ట్రీ షెడ్ను ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెరగడం ద్వారా పేద కుటుంబాల జీవనం మెరుగుపడుతుందని తెలిపారు. మాదారం పంచాయతీలోని మంగపేట టీడబ్ల్యూఆర్ పాఠశాలకు ప్రహరీ గోడ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు కమ్యూనిటీ భవనం నిర్మాణానికి పునాది వేశారు. సత్యంపేట గ్రామంలో ప్రాథమిక పాఠశాలకు ప్రహరీ గోడ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రామాంజనేయపురం గ్రామంలో స్వయం సహాయక సంఘాల కమ్యూనిటీ భవన నిర్మాణానికి పునాది వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి గ్రామం అభివృద్ధి చెందే వరకు విశ్రాంతి తీసుకోనని తెలిపారు. ప్రజల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయడం ప్రజాప్రతినిధిగా తన బాధ్యత అని అన్నారు. అశ్వారావుపేట నియోజకవర్గాన్ని అభివృద్ధి పరంగా ఆదర్శంగా నిలపాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్ రావు, బత్తుల అంజి, కారం సుధీర్, మండల అధికారులు, గ్రామపంచాయతీల సర్పంచులు, ఉపసర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు. కార్యక్రమాలు ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి.







## గుమ్మడవల్లి హై స్కూల్ సైన్స్ దినోత్సవం

- విద్యార్థుల ప్రతిభ
- సృజనాత్మక నమూనాలు
- ప్రధానోపాధ్యారు ప్రసంగం
- సైన్స్ టీచర్ సత్కారం





**అశ్వారావుపేట, ఫిబ్రవరి 28:** గుమ్మడవల్లి హై స్కూల్లో నేషనల్ సైన్స్ దినోత్సవం ఘనంగా జరుపుకోబడింది. కార్యక్రమంలో డ్రాయింగ్, క్విజ్, వ్యాస రచన, వాదన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. సైన్స్ టీచర్ అనూషను శాలువతో సత్కరించారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యా యులు టి. వీరేశ్వర రావు విద్యార్థులను ప్రసంగంలో అభినందిస్తూ, "సైన్స్ కేవలం పాఠ్యాంశం కాదు, అది ఆలో చనశక్తి, పరిశీలన మరియు సృజనాత్మకతను పెంపొంది స్తుంది. చిన్న ప్రయత్నాలు, పరిశీలనలు భవిష్యత్తులో విజ్ఞాన వేత్తలుగా ఎదగడానికి మార్గం చూపుతాయి" అని చెప్పారు. సీవీ రామన్ ఫోటో పూలదండతో అలంకరించి, వారి జీవిత చరిత్ర, ఆవిష్కరణలను విద్యార్థులకు వివరించారు. రామన్ ఎఫెక్ట్ పై విద్యార్థులు ఆసక్తికరమైన ప్రశ్నలు అడిగి పాల్గొ న్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, శ్రీనివాసరావు, సోషల్ టీచర్ అరుణ , హిందీ టీచర్, తెలుగు టీచర్ బండి రామచంద్రరావు, పిఈటి, ఇతర సిబ్బంది, వి ద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. కార్యక్రమం విద్యార్థుల లో విజ్ఞాన ఆసక్తిని పెంపొందించడంలో స్ఫూర్తిదాయకంగా నిలిచింది.



## సీతారాముల తలంబ్రాలు ఇంటి వద్ద కేవలం 151 రూపాయలే

**ఆర్టీసీ లాజిస్టిక్స్ ద్వారా.. భక్తుల సౌకర్యం కోసం**

**సత్తుపల్లి, ఫిబ్రవరి 28:** భద్రాచలం శ్రీ సీతారామ చంద్రుల కళ్యాణోత్సవ సందర్భంలో ముత్యాల తలంబ్రాలను భక్తుల ఇంటి వద్దకు 151 రూపాయలతో అందజేయనున్నట్లు సత్తుపల్లి డిపో మేనేజర్ గురిజాల లక్ష్మీనారాయణ తెలిపారు. తలంబ్రాల పోస్టర్ శనివారం ఆవిష్కరించారు. సుదూర ప్రాంతాల నుండి భద్రాచలం వెళ్ళలేని భక్తులు www.tgsrtclogistics.gov.in ద్వారా లేదా స్థానిక ఆర్టీసీ కౌంటర్లలో బుకింగ్ చేసుకోవచ్చని చెప్పారు. అదనంగా వివిధ నంబర్లకు ఫోన్ చేసి కూడా బుకింగ్ చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ తో పాటు అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్ సాహితి, ఏడీసీలు ఇజ్రాయిల్, అప్పారావు, ఆఫీస్ సిబ్బంది బాబురావు, కోటేశ్వరరావు, వి.బి.ఓ ఆనందరావు, కార్గో డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ ఎస్కె. మునీర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# కుట్టు చేతులకు చేయూత

**పేదలకు ఉపాధి ఆశ.. రోగికి ఆదరణ హామీ**
**ఇళ్ల కలలకు బలం**



**అశ్వారావుపేట, ఫిబ్రవరి 28:** ప్రపంచ టైలర్స్ డే సందర్భంగా అశ్వారావుపేట మండల కేంద్రంలో టైలర్ల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. కార్యక్రమానికి ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ముఖ్య అతిథిగా హాజరై టైలర్ల సేవలను కొనియాడారు. చేతివృత్తులపై ఆధారపడే కుటుంబాలకు ఉపాధి అవకాశాలు పెరగాలని, టైలర్ల వృత్తి గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో ముఖ్యమైన పాత్ర పోషిస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా పేద కుటుంబాలకు ఆర్థికంగా నిలదొక్కుకునే అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో నల్లబోతుల వరలక్ష్మి, ఊడ ఉమాదేవి ఇద్దరికీ ఎమ్మెల్యే తన వ్యక్తిగత నిధులతో రెండు కుట్టు యంత్రాలను ఉచితంగా అందజేశారు. మహిళలు స్వయం ఉపాధి ద్వారా కుటుంబాలను ముందుకు నడిపించే శక్తిగా మారాలని ఆకాంక్షించారు. చిన్న స్థాయి వృత్తుల ద్వారా కుటుంబాల జీవనం మెరుగుపడుతుందని, ప్రభుత్వ పథకాలతో పాటు వ్యక్తిగత సహాయం కూడా అందించేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. అదే కార్యక్రమంలో మినుగుల సుశీల కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న విషయం తెలుసుకుని ఎమ్మెల్యే ఆమెను పరామర్శించారు. బాధితురాలికి మెరుగైన వైద్యం అందేలా అవసరమైన సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు. పేదలకు వైద్యం అందుబాటులో ఉండటం అత్యంత ముఖ్యమని, ఆర్థిక ఇబ్బందుల వల్ల చికిత్స ఆగిపోకూడదని అన్నారు. అనంతరం ఎర్రంశెట్టి రంగనాథ్ నూతన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఇల్లు అనేది పేదల జీవితంలో భద్రతకు ప్రతీకగా నిలుస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తుమ్మా రాంబాబు, జూపల్లి ప్రమోద్, వార్డు కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, టైలర్ల సంఘం ప్రతినిధులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు. కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో సాగింది.





## దమ్మపేటలో ఘనంగా అంతర్జాతీయ టైలర్స్ దినోత్సవం

**దమ్మపేట, ఫిబ్రవరి 28:** శనివారం మండల కేంద్రంలో అంతర్జాతీయ టైలర్స్ దినోత్సవాన్ని టైలర్ యూనియన్ మండల అధ్యక్షుడు చవ్వా పోలయ్య జెండా ఆవిష్కరించి ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా చావ్వా పోలయ్య మాట్లాడుతూ మానవుడి ప్రాథమిక అవసరాలైన కూడు, గూడు, గుడ్డలలో మూడవదైన వస్త్రానికి ఒక అందమైన రూపాన్ని ఇచ్చే అద్భుత కళాకారులు టైలర్లని, ప్రతి ఏటా ఫిబ్రవరి 28న ప్రపంచవ్యాప్తంగా 'అంతర్జాతీయ దర్జీల దినోత్సవం' నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు. ఆధునిక కుట్టు మిషన్ను కనుగొన్న సర్ విలియం ఎలియాస్ హోవ్ పుట్టినరోజును పురస్కరించుకుని ఈ టైలర్ దినోత్సవాన్ని జరుపుకుంటామనీ, ఆయన ఆవిష్కరణ దర్జీల పనిలో వేగాన్ని, కచ్చితత్వాన్ని తీసుకురావడమే కాకుండా, ప్రపంచ ఫ్యాషన్ రంగ గమనాన్ని మార్చివేసిందనీ, ఒక సాదా సీదా గుడ్డ ముక్కను తీసుకుని, దానికి సరైన కొలతలు అద్ది, శరీరానికి హుందాతనాన్ని ఇచ్చే దుస్తులుగా మార్చడం వెనుక దర్జీల కృషి వెలకట్టలేనిదనీ, మారుతున్న కాలానికి అనుగుణంగా కొత్త డిజైన్లను సృష్టించడం, పాత బట్టలను సరిచేసి మళ్లీ వాడకంలోకి తీసుకురావడం ద్వారా పరోక్షంగా పర్యావరణ పరిరక్షణకు కూడా తోడ్పడుతున్నామనీ తెలిపారు. ప్రతి మనిషి దుస్తుల్లో అందం, ఆత్మవిశ్వాసం కలగడానికి కష్టపడే వ్యక్తి టైలరనీ, టైలర్ కేవలం బట్టలు కుట్టేవాడు మాత్రమే కాదు, ఫ్యాషన్కు రూపం ఇచ్చే కళాకారుడనీ, వివాహాలు, పండుగలు, ప్రత్యేక వేడుకలు, ప్రతి సందర్భంలో మనకు సరైన కొలతలు తీసుకుని అందంగా దుస్తులు తయారు చేసే బాధ్యత టైలర్లదేననీ, గ్రామీణ ప్రాంతాల్లో చిన్న షాపుల నుంచి పట్టణాల్లో ఆధునిక బుటిక్ల వరకు టైలర్ల సేవలు విస్తరించాయనీ, ప్రస్తుతం రెడీమేడ్ దుస్తుల వినియోగం పెరిగినా, వ్యక్తిగత కొలతలతో కుట్టించుకునే దుస్తులకు డిమాండ్ తగ్గలేదనీ, ముఖ్యంగా మహిళల డిజైనర్ బ్లౌజ్లు, పెళ్లి దుస్తులు, స్కూల్ యూనిఫార్మ్లు వంటి విభాగాల్లో టైలర్లకు విస్తృత ఉపాధి అవకాశాలు ఉన్నాయనీ, ప్రభుత్వం కూడా నైపుణ్యాభివృద్ధి శిక్షణల ద్వారా టైలరింగ్ రంగాన్ని ప్రోత్సహించాలన్నారు. మిషన్ల ఖర్చు పెరగడం, వస్త్రాల ధరలు అధికం కావడం, రెడీమేడ్ మార్కెట్ పోటీ వంటి సమస్యలు టైలర్లను ప్రభావితం చేస్తున్నాయి. అయినప్పటికీ తమ ప్రతిభ, కష్టపడి పనిచేసే నైపుణ్యంతో ఈ రంగాన్ని నిలబెడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టైలర్స్ యూనియన్ వైస్ ప్రెసిడెంట్ కందుల మారేశ్వరరావు, సెక్రటరీ చావ్వా కొండయ్య, మురహరి నాగరాజు, పోతూ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

తొలిక్రాంతి
ఆదివారం
01 మార్చి 2026



## వెంకటేశ్వర ఆలయోత్సవం

**సత్తుపల్లి, ఫిబ్రవరి 27:** వేంసూరు మండలంలోని కందుకూరు గ్రామంలో వెంకటేశ్వర స్వామి ఆలయ నూతన కమిటీ ప్రమాణస్వీకారోత్సవంలో ఎమ్మెల్యే సత్తుపల్లి రాగమయి ఘనంగా పాల్గొన్నారు. ఆలయ ప్రధాన అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. దేవాదాయ శాఖ ఆదేశాల మేరకు 27 ఫిబ్రవరి నుంచి 4 మార్చి వరకు ఉత్సవ కమిటీ ఏర్పాటు చేయబడింది. ఎమ్మెల్యే సమక్షంలో నూతన చైర్మన్ బండి వెంకట కృష్ణారెడ్డి, సభ్యులు చార్ల సుదీర్ రెడ్డి, పిల్లం మంగతాయారు, యామిని రాణి, సత్యవాణి, సత్యనారాయణ చెన్నారావు, రాజా రాములు, వెంకటేశ్వరరావు, నస్రాన్ సాహెబ్, వెంకన్న బాబురావు, వెంకట రామారావు ప్రమాణ స్వీకారం చేశారు. సత్తుపల్లి ఎమ్మెల్యే నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వేంసూరు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## తూటికుంట్లలో సిసి రోడ్ల శంకుస్థాపన

**బోనకల్, ఫిబ్రవరి 28:** మండల పరిధిలోని తూటికుంట్ల గ్రామంలో ఎస్సీ సబ్ ప్లాన్ కింద 68 లక్షల నిధులను ఉపయోగించి అంతర్గః సిమెంట్ కాంక్రీట్ రోడ్ల పనులు శంకుస్థాపన అయింది. గ్రామ సర్పంచ్ తుళ్లూరి లక్ష్మీ నరసయ్య మాట్లాడుతూ నిధులను మంజూరు చేసిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మరియు ఉప ముఖ్యమంత్రివర్యుడు మల్లుభట్టి విక్రమార్కకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ కంచర్ అచ్చయ్య, వార్డ్ మెంబర్లు ఝాన్సీ, లక్ష్మి, సుందరమ్మ, లక్ష్మి, ప్రవీణ్ చిన్నప్ప, సురేందర్, శ్రీను, ఆదినారాయణ పాల్గొన్నారు.

## అమెరికాను కొల్లగొడుతోన్న దేశాలకు డబ్బులివ్వాలా..?: ట్రంప్

**యూఎస్ :** ప్రపంచ దేశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన టారిఫ్‌లు చెల్లవని అక్కడి సుప్రీంకోర్టు ఇటీవల సంచలన తీర్పు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ తీర్పుపై తాజాగా ట్రంప్ మరోసారి స్పందించారు. సుప్రీం తీర్పుతో విదేశాలకు, కంపెనీలకు పెద్ద మొత్తంలో డబ్బులు తిరిగి చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ మేరకు ఆయన ట్రూత్ సోషల్‌లో పోస్టు పెట్టారు. 'ఇటీవల సుప్రీం ఇచ్చిన తీర్పు.. ఎన్నో సంవత్సరాలుగా యూఎస్‌ను కొల్లగొడు తోన్న దేశాలు, కంపెనీలకు వందల బిలియన్ డాలర్లు తిరిగి చెల్లించేందుకు దారితీస్తుంది. ఇది అర్థరహితం. న్యాయస్థానం దీన్ని పరిగణనలోకి తీసుకోలేదని నేను బలంగా విశ్వసిస్తున్నా. ప్రపంచం ఇంతకుముందు ఎన్నడూ ఇలాంటి తీర్పును చూడలేదు. ఇది నన్ను తీవ్ర నిరాశకు గురిచేసింది. ఈ కేసును తిరిగి విచారించడం సాధ్యమేనా?' అని ట్రంప్ రాసుకొచ్చారు.



## విజ్ఞాన వెలుగు

- విద్యార్థుల ప్రతిభా ప్రదర్శన
- ఆశ్చర్యపరిచిన నమూనాలు
- శాస్త్రదారిలో నడవమని పిలుపు

**బోనకల్, ఫిబ్రవరి 28:** స్థానిక షైన్ ఉన్నత పాఠశాలలో జాతీయ విజ్ఞాన శాస్త్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి యువ నాయకుడు బి.పి నాయక్, వైరా సహాయ పోలీసు అధికారి సారంగపాణి, బోనకల్ పోలీసు అధికారి పొదిలి వెంకన్న ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థుల ప్రతిభను అభినందించారు. ఈ సందర్భంగా మొదటి తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు విజ్ఞాన శాస్త్రానికి సంబంధించిన వివిధ నమూనాలను తయారు చేసి ప్రదర్శించారు. మొత్తం అరవై నమూనాలు ఏర్పాటు చేసి తమ ప్రతిభను చాటుకున్నారు. విద్యార్థులు తయారు చేసిన నమూనాలను అతిథులకు స్వయంగా వివరించి ఆకట్టుకున్నారు. చిన్న వయసులోనే విజ్ఞానంపై ఆసక్తి పెంపొందించుకోవడం భవిష్యత్తులో గొప్ప ఫలితాలను ఇస్తుందని ఉపాధ్యాయులు తెలిపారు. వైరా సహాయ పోలీసు అధికారి సారంగపాణి మాట్లాడుతూ విద్యార్థులే దేశ భవిష్యత్తుకు ఆధారం అని అన్నారు. విజ్ఞాన శాస్త్రంలో ముందుకు సాగి దేశ అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. క్రమశిక్షణతో చదువుకుంటే ఉన్నత స్థానాలు సాధించడం సాధ్యమవుతుందని చెప్పారు. యువ నాయకుడు బి.పి నాయక్ మాట్లాడుతూ ఏ. పి. జె. అబ్దుల్ కలాం వంటి గొప్ప శాస్త్రవేత్తలు మన దేశంలో పుట్టారని గుర్తు చేశారు. అలాంటి మహనీయులను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని కోరారు. కృషి, పట్టుదల ఉంటే విజయాన్ని సాధించవచ్చని అన్నారు. పోలీసు అధికారి పొదిలి వెంకన్న మాట్లాడుతూ యువత ఎప్పుడూ ప్రయత్నం ఆపకూడదని సూచించారు. కష్టపడి చదివితే తప్పకుండా ఫలితం వస్తుందని, పట్టుదలతో ముందుకు సాగాలని విద్యార్థులను ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల నిర్వహణ బాధ్యుడు అన్సర్ పాషా, నిర్వాహకుడు లాల్ మహమ్మద్, ప్రధానోపాధ్యాయురాలు శ్వేత, కార్యనిర్వహణ బాధ్యుడు నాగేశ్వరరావు, విజ్ఞాన శాస్త్ర ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, వెంకట్, వాణి శైలజ, కవిత, రుక్సానా, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది.

# జవహర్ పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం

- విద్యార్థుల ప్రతిభ
- సృష్టించిన నమూనాలు ఆకర్షణ
- ఉపాధ్యాయులు అభినందన
- తల్లిదండ్రులు హాజరు





**అశ్వారావుపేట, ఫిబ్రవరి 28:** జవహర్ ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా జరిగింది. భౌతిక శాస్త్రంలో "రామన్ ఎఫెక్ట్" 1928లో విజయవంతమయిన రోజును గుర్తుచేసుకుని ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ దినోత్సవం గా జరుపుకుంటారు. సీ.వి. రామన్ ఈ పరిశోధనకు 1930లో నోబెల్ బహుమతి పొందారు. పాఠశాల విద్యార్థులు సృజనాత్మకతతో తయారు చేసిన 60కి పైగా నమూనాలను ప్రదర్శించారు. విద్యార్థులు తమ నమూనాలను పాఠశాల నిర్వాహకులు మరియు ముఖ్య అతిథులకు స్వయంగా వివరించారు. ఫలితంగా ఆవిష్కరణ, పరిశీలనలో అందరూ ఆశ్చర్యపోయారు. నమూనాలు విద్యార్థుల ఆలోచనశక్తి, పరిశోధన శ్రద్ధను ప్రతిబింబించాయి. పాఠశాల వ్యవస్థాపకురాలు సంతపూరి భారతిదేవి, ప్రధానోపాధ్యాయురాలు ఎస్. మైథిలీ మరియు కరస్పాండెంట్ ఐ. ప్రవీణ్ కుమార్ విద్యార్థులను అభినందించారు. విద్యార్థుల ప్రతిభ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అందరూ గర్వంగా చూసుకున్నారు. ముఖ్యంగా పలువురు ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రత్యేకంగా ప్రోత్సహించారు. ఈ వేడుకలో పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొని విద్యార్థుల ప్రదర్శనను ఆస్వాదించారు. విద్యార్థుల కృషి, సృజనాత్మకత పాఠశాలకు పేరు తెచ్చే విధంగా ఉందని పాఠశాల అధికారులు పేర్కొన్నారు. సమగ్రంగా ఈ వేడుక విద్యార్థులలో విజ్ఞానంపై ఆసక్తిని పెంపొందించింది, భవిష్యత్తులో శాస్త్ర పరిశోధనలో కొనసాగించేలా స్ఫూర్తి కలిగించిందని అన్నారు.







## సూర్య స్కూల్‌లో విద్యార్థుల వేడుకలు

- చిన్నారి విజేతకు బహుమతి
- కుమార్తె విజయానికి ప్రత్యేక ఆనందం
- యుపిఎస్ పాఠశాల వేడుకల్లో పాల్గొనడం
- చదువు భవిష్యత్తుకు మాతృకా




**అశ్వారావుపేట, ఫిబ్రవరి 28:** పాత నారం వారి గూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ యువ నాయకుడు పేరం నాగబాబు మరియు దంపతులు తమ కుమార్తె చదువుతున్న సూర్య స్కూల్‌లో జరిగిన వేడుకలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తన కుమార్తెకు బహుమతిని స్వయంగా అందజేసి ఆనందం వ్యక్తం చేశారు. పేరం నాగబాబు మాట్లాడుతూ, పాఠశాలలో జరుగుతున్న వేడుకల్లో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందని, విద్యార్థులు చదువుతో భవిష్యత్తు ముడిపడే అవకాశం పొందుతున్నారని పేర్కొన్నారు. చిన్నారులు మంచి చదువులు చదువుకుని తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తెచ్చేలా ప్రోత్సహించాలని ఆకాంక్షించారు. అదే సమయంలో, యుపిఎస్ పాత నారం వారి గూడెం పాఠశాల వేడుకల్లో కూడా పాల్గొని విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ఇతర గ్రామస్తులు, మరియు విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. వేడుకలు విద్యార్థులలో స్ఫూర్తిని నింపి, చదువులో మరింత ఆసక్తిని పెంపొందించాయి.



## ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు

**అశ్వారావుపేట, ఫిబ్రవరి 28:** అశ్వారావుపేట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సైన్స్ ఉపాధ్యాయులు లక్ష్మయ్య, మధు, చలపతిరావు, మధుబాబు,సువార్తమ్మ ,పర్వీన్ ల ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. విద్యార్థులు స్వయంగా తయారుచేసిన సైన్స్ మోడల్స్ ను ప్రదర్శించారు. 50కి పైగా ప్రదర్శనలను విద్యార్థులు తయారుచేసి ప్రదర్శించారు. ఇందులో వెల్డింగ్ గ్యాస్ తయారి , మెక్రోస్కోప్ ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం ప్రధానోపాధ్యాయురాలు పరుచూరి హరిత అధ్యక్షతన నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవ సభలో అన్ని పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతలును అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మానవ మనుగడలో శాస్త్రీయత మూలమని శాస్త్ర సాంకేతిక రంగాలలో విద్యార్థులు కృషి చేయాలని మంచి కోసం కృత్రిమ మేధస్సు ను వినియోగించాలని ఉన్నత అవకాశాలను అందిపుచ్చుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నరు.

## సురక్షిత ప్రాంతానికి ఖమేనీ తరలింపు



**టెహ్రాన్, ఫిబ్రవరి 28 :** ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా యుద్ధం మొదలుపెట్టాయి. 'ఆపరేషన్ షీల్డ్ ఆఫ్ జూడా' పేరుతో ఇజ్రాయెల్ క్షిపణులు, బాంబులతో ఇరాన్ రాజధాని టెహ్రాన్‌పై శనివారంనాడు విరుచుకుపడింది. ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా ఖమేనీ కార్యాలయం సమీపంలో దాడులు జరిగాయి. ఖమేనీ, అధ్యక్ష భవనాలే టార్గెట్‌గా ఈ మెరుపు దాడులు జరిగినట్టు చెబుతున్నారు. దాడుల సమయంలో ఖమేనీ టెహ్రాన్‌లో లేరని తెలుస్తోంది. ఇప్పటికే ఆయనను సురక్షిత ప్రాంతానికి తరలించినట్టు చెబుతున్నారు. అయితే ఆయనను ఎక్కడకు తరలించారు, ఎప్పుడు తరలించారనే వివరాలు వెల్లడి కాలేదు. ఖమేని ఇరాన్ వదిలి వెళ్లాలని, లేదంటే విడిచిపెట్టేది లేదని ట్రంప్ ఇప్పటికే హెచ్చరించారు. దీంతో ఖమేనీ లక్ష్యంగానే అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త దాడులు మొదలుపెట్టినట్టు కథనాలు వెలువడుతున్నాయి. ఇరాన్‌పై అమెరికా బలగాలు పెద్దఎత్తున సైనిక చర్యకు దిగినట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఇందుకు సంబంధించిన 8 నిమిషాల వీడియోను ట్రంప్ తన ట్రూత్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. వాషింగ్టన్ సైనిక చర్యను ఆయన సమర్థించుకున్నారు. ఇరాన్ పాలకుల నుంచి అమెరికా ప్రజలకు ఉన్న ముప్పును తప్పించేందుకే సైనిక చర్యలకు దిగామన్నారు. ఇరాన్ కార్యక్రమాలు అమెరికాకు, అమెరికా బలగాలకు, విదేశాల్లోని తమ స్థావరాలు, ప్రపంచంలోని తమ మిత్రదేశాలకు ముప్పుగా ఉన్నాయన్నారు. మరోవైపు, ఇజ్రాయెల్‌పై ఇరాన్ ప్రతీకార దాడులు చేపట్టింది. ఇజ్రాయెల్‌తో పాటు పశ్చిమాసియాలోని అమెరికా సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకున్నట్టు తెలుస్తోంది. యూఏఈ, కువైట్, ఖతర్‌లలో పేలుళ్లు వినిపించినట్టు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. బహ్రెయిన్‌లోని అమెరికా నేవీ 5వ ఫ్లీట్‌పై క్షిపణి దాడి జరిపినట్టు ఆ దేశం ధ్రువీకరించింది. ఇరాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో బహ్రెయిన్ బేస్ నుంచి ఇప్పటికే తమ నౌకలను అమెరికా నేవీ ఉపసంహరించుకున్నట్టు చెబుతున్నారు. ఖతర్ రెండు ఇరాన్ క్షిపణులను అడ్డుకున్నట్టు తెలుస్తోంది.



## ఎన్ఎంఎంఎస్‌కు హై స్కూల్ విద్యార్థుల ఎంపిక

**అశ్వారావుపేట, ఫిబ్రవరి 28:** కేంద్ర ప్రభుత్వం అందించే అత్యంత ప్రతిష్టాత్మకమైన జాతీయస్థాయిమీన్స్ కం మెరిట్ స్కాలర్షిప్ కు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అశ్వారావుపేటకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపిక అయ్యారు 8వ తరగతికి చెందిన ఎ. వీరేన్, బి.మణిచందనరాజు లు ఎంపిక కాగా ఈ విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి హరిత అభినందించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను వినియోగించుకుని క్రమశిక్షణతో ఉన్నత విద్యలో రాణించాలని అన్నారు ఎన్ఎంఎంఎస్ స్కాలర్షిప్ ద్వారా ఎంపికైన విద్యార్థికి పీజీ స్థాయి వరకు సంవత్సరానికి 12,000 చొప్పున కేంద్ర ప్రభుత్వం అందిస్తుందని ఈ మెరిట్ స్కాలర్షిప్ కు పాఠశాల విద్యార్థులు ఎంపిక కావటం లో తర్ఫీదునిచ్చిన ఉపాధ్యాయులు అభినందనీయులని అన్నారు.

# మరోమారు భగ్గుమన్న పుత్తడి ధరలు


## పెళ్లిళ్ల సీజన్ కావడంతో సామాన్యుల బెంబేలు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28 :** దేశంలో బంగారం, వెండి ధరలు సామాన్యుల అంచనాలకు అందని విధంగా మారుతున్నాయి. రెండు రోజుల పాటు దాదాపు స్థిరంగా కొనసాగిన ధరలు శనివారం ఒక్కసారిగా భగ్గుమన్నాయి. దేశంలో బంగారం ధర సగటున రూ.3 వేల మేర పెరగ్గా వెండి ధర కూడా చెప్పుకోదగ్గ స్థాయిలోనే ఎగబాకింది. అసలే పెళ్లిళ్ల సీజన్ కావడంతో సామాన్యులకు ధరలు కంగారు పెట్టిస్తున్నాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, శనివారం ఉదయం 10.00 గంటల సమయంలో హైదరాబాద్‌లో 24 క్యారెట్ 10 గ్రాముల పసిడి ధర రూ.1,64,730లకు చేరుకుంది. నిన్నటి ముగింపు ధరతో పోలిస్తే ఏకంగా రూ.3,160ల మేర పెరిగింది. ఇక 22 క్యారెట్ పసిడి ధర కూడా రూ.2,900ల మేర పెరిగి రూ.1,51,000లకు చేరుకుంది. నగరంలో వెండి ధర కూడా రూ.5 వేల మేర పెరిగింది. ప్రస్తుతం కిలో వెండి రూ.3 లక్షలుగా ఉంది. చెన్నైలో 24 క్యారెట్ 10 గ్రాముల పసిడి ధర గరిష్ఠంగా రూ.1,65,820కు చేరింది. ముంబై, కర్ణాటక, బెంగళూరు నగరాల్లో మేలిమి బంగారం ధర రూ.1,64,730గా ఉంది. ఢిల్లీలో రూ.1,64,880ల వద్ద కొనసాగుతోంది. ఇక 22 క్యారెట్ ఆర్నమెంటల్ బంగారం ధర (10 గ్రాములు) చెన్నైలో రూ.1,52,000గా, ముంబై, కోల్‌కతా, బెంగళూరు



నగరాల్లో రూ.1,51,000 వద్ద కొనసాగుతోంది. నగరాల వారీగా వెండి ధరలను పరిశీలిస్తే.. చెన్నైలో కిలో వెండి ప్రస్తుతం రూ.3 లక్షలకు చేరుకుంది. ముంబై, ఢిల్లీ, కోల్‌కతా, బెంగళూరు నగరాల్లో రూ.2.95 లక్షల వద్ద కొనసాగుతోంది.



# సిమ్ లేకుంటే వాట్సప్ బంద్..

### 1 నుంచి ఈ రైల్వే యాప్ క్లోజ్

ప్రతినెలా క్యాలెండర్ మారడంతో పాటు ఆర్థికపరంగా కొన్ని మార్పులు చోటుచేసుకుంటున్నాయి. వాటిని ఎప్పటికప్పుడు తెలుసుకోవడం ముఖ్యం. అలా మార్చి ఒకటి నుంచి కొన్ని మార్పులు రాబోతున్నాయి. సిమ్ బైండింగ్, యూపీఐకి సంబంధించిన రూల్స్ ఈ జాబితాలో ఉన్నాయి. వాట్సప్ బంద్: వాట్సప్, టెలిగ్రామ్, సిగ్నల్, అరట్టై వంటి కమ్యూనికేషన్ యాప్స్‌నకు సిమ్ కార్డు బైండింగ్‌ను తప్పనిసరి చేస్తూ కేంద్రం కొత్త నిబంధనలు తీసుకొచ్చింది. మార్చి 1 నుంచి ఈ రూల్స్ అమల్లోకి రానున్నాయి. ఫోన్‌లో సిమ్‌కార్డు లేకపోయినా లేదా సిమ్ తొలగించినా యాప్ సేవలు ఆటోమేటిక్‌గా ఆగిపోతాయి. ఆయా యాప్‌లను వెబ్‌బ్రౌజర్‌లో ఉపయోగిస్తే ప్రతి 6 గంటలకు ఒకసారి లాగౌట్ అవుతుంది. సైబర్ మోసాలను అరికట్టే ఉద్దేశంతో ఈ రూల్స్ తీసుకొచ్చింది.

**యూటీఎస్ సేవలు నిలిపివేత:** జనరల్ టికెట్లు, ప్లాట్‌ఫామ్ టికెట్ల బుకింగ్ కోసం రైల్వే శాఖ గతంలో తీసుకొచ్చిన యూటీఎస్ యాప్ మార్చి 1 నుంచి నిలిచిపోనుంది. ఈ సేవలన్నీ రైల్వేశాఖ కొత్తగా తీసుకొచ్చిన రైల్‌వన్ యాప్‌లో లభ్యమవుతాయి. యూటీఎస్ ఆర్-వాలెట్‌లోని నగదు ఉంటే రైల్‌వన్ యాప్‌నకు బదిలీ అవుతుంది.

**యూపీఐకి బయోమెట్రిక్:** యూపీఐ చెల్లింపులు మరింత సురక్షితం కానున్నాయి. పెద్ద మొత్తంలో లావాదేవీలు జరిపేటప్పుడు పిన్‌తో పాటు బ్యాంకులు అదనంగా బయోమెట్రిక్ లేదా ఇతర ఆథరైజేషన్‌ను అడగనున్నాయి. దీంతో మోసాలను అరికట్టొచ్చు.

**1600 సిరీస్:** బ్యాంకులు, ఆర్థిక సంస్థలు తమ వినియోగదారులకు చేసే ఫోన్‌కాల్స్ '1600 సిరీస్' నంబరును వినియోగించాలని ట్రాయ్ స్పష్టంచేసింది. బ్యాంకులు ఇప్పటికే దీన్ని అమలు చేస్తున్నాయి. మార్చి 1 నుంచి ఎన్‌బీఎఫ్‌సీలు, మార్చి 15 నుంచి స్టాక్‌బ్రోకర్ల నుంచి వచ్చే కాల్స్ కూడా ఈ సిరీస్ నుంచే రానున్నాయి. బ్యాంకుల పేరిట సైబర్ నేరగాళ్లు చేస్తున్న మోసాలను అరికట్టేందుకు ట్రాయ్ ఈ నిర్ణయం తీసుకుంది.

# విండీస్ 'హిట్టింగ్'కు చెక్‌పెడితేనే..

## భారత్‌కు సెమీస్ బెర్తు ఖాయం

పొట్టికప్ సూపర్-8లో భారత్, వెస్టిండీస్ తమ చివరి మ్యాచ్‌లో తలపడేందుకు సిద్ధమవుతున్నాయి. కోల్‌కతా వేదికగా మ్యాచ్ జరగనుండటంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది. పిచ్ కూడా బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉంటుందనే వార్తలు వచ్చాయి. ఒకవైపు భారత బ్యాటర్లకు పని సులువైనప్పటికీ.. పేసర్లు, స్పిన్నర్లకు మాత్రం కఠిన సవాలు తప్పదు. విండీస్ జట్టులో దూకుడుగా ఆడే బ్యాటర్లకు కొదవేం లేదు. ఈ టీ20 ప్రపంచ కప్‌లో ఎక్కువ సిక్స్‌లు కొట్టిన జట్టు విండీస్. మొత్తం 66 సిక్స్‌లను ఆ జట్టు బ్యాటర్లు బాదారు. ఒకరి తర్వాత మరొకరు హిట్టింగ్ చేసేందుకే మొగ్గు చూపిస్తారు. హమ్మయ్య.. ఈ బ్యాటర్ ఔటయ్యాడని సంబరపడేలోగా మెరుపు ఇన్నింగ్స్‌లు ఆడే స్టార్లు విండీస్ సొంతం. చివరి మ్యాచ్‌లో గెలవడం మనకెంత ముఖ్యమో.. వారికీ అంతే.

**ఇదీ వారి బలం..**

మన సత్తాపైనే ఫోకస్ పెట్టడంలో తప్పులేదు. కానీ, అవతలి జట్టు బలంపైనా ఓ కన్నేయాలి. ఎవరు ఏ స్టైల్‌లో ఆడతారు? ఎవరిని ఎలా పెవిలియన్‌కు చేర్చాలి? అనేదానిపై కసరత్తు చేస్తేనే విజయం సిద్ధిస్తుంది. వెస్టిండీస్ జట్టులో షిమ్రోన్ హెట్‌మయెర్ వికెట్ అత్యంత కీలకం. అలాగని మిగతా బ్యాటర్లు తక్కువని అర్థం కాదు. ఓపెనర్లు షై హోప్, బ్రాండన్ కింగ్, రోవ్‌మన్ పావెల్, షెర్ఫానె రూథర్‌ఫోర్డ్, రొమారియో షెఫర్డ్, జాసన్ హోల్డర్.. ఇలా తొమ్మిదో నంబర్ వరకూ వారి జోరు కొనసాగుతుంది. ఐపీఎల్‌లో ఆడటంతో వీరిందరికి భారత పిచ్‌లు ఎలా స్పందిస్తాయో బాగా తెలుసు. వచ్చామా..? భారీషాట్లు కొట్టామా? అనే స్థాయిలోనే వీరి హిట్టింగ్ ఉంటుంది. హెట్‌మయెర్ (17 సిక్స్‌లు), రూథర్‌ఫోర్డ్ (12 సిక్స్‌లు) అత్యధిక సిక్సర్ల జాబితాలో



ముందున్నారు. టీమ్ఇండియా స్టార్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా నుంచి అద్భుతమైన స్పెల్ రావాలి. వరుణ్ చక్రవర్తి తనకు అచ్చొచ్చిన 'ఈడెన్ గార్డెన్స్'లో చెలరేగితే టీమ్ఇండియాకు తిరుగుండదు. అర్ష్‌దీప్, హార్దిక్ పాండ్య పదునైన బౌలింగ్‌తో విండీస్ హిట్టింగ్‌కు చెక్ పెడితే విజయంతోపాటు సెమీస్ బెర్తు భారత్‌దే అవుతుంది.ల

**బౌలింగ్‌లోనూ..** పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉండే నేపథ్యంలో కెప్టెన్ సూర్య కుమార్ యాదవ్‌తోపాటు అభిషేక్ శర్మ, సంజు శాంసన్, ఇషాన్ కిషన్, తిలక్ వర్మ, హార్దిక్, శివమ్ దూబె నుంచి మెరుపు ఇన్నింగ్స్‌లు రావాలి. 'జింబాబ్వే'పై ఆడిన తరహాలో బౌండరీల వర్షం కురిపించాలి. విండీస్ బౌలర్లలో షమార్ జోసెఫ్, మోతీ, రొమారియో షెఫర్డ్, జాసన్ హోల్డర్, అకీల్ హుసేన్ నుంచి ప్రతిఘటన ఎదరయ్యే అవకాశం ఉంది. అయితే, వెస్టిండీస్‌పై ప్రపంచ కప్ టోర్నీల్లో భారత్‌దే ఆధిపత్యం కావడం మనకు సానుకూలాంశం.






# జమ్మూ కశ్మీర్‌దే రంజీ ట్రోఫీ

తొలిసారి జమ్మూ కశ్మీర్ రంజీ ట్రోఫీ విజేతగా నిలిచింది. కర్ణాటకతో జరిగిన రంజీ ట్రోఫీ 2025-26 సీజన్ ఫైనల్ మ్యాచ్ డ్రా ముగిసింది. అయితే, తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సాధించిన జమ్మూ కశ్మీర్ ట్రోఫీని సొంతం చేసుకుంది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా శుభమ్ పుందిర్, ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా అకిబ్ నబీ ఎంపికయ్యారు. ఓవర్‌నైట్ 186/4 స్కోరుతో జమ్మూ కశ్మీర్ తన రెండో ఇన్నింగ్స్‌ను చివరి రోజూ కొనసాగించింది. ఖమ్రాన్ ఇక్బాల్ (160), సాహిల్ లోత్రా (101) సెంచరీలు సాధించారు. 342/4 స్కోరు వద్ద జమ్మూ కశ్మీర్ తన రెండో ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేస్తున్నట్లు కెప్టెన్ పరాస్ డోగ్రా ప్రకటించాడు. అప్పటికి మరొక్క సెషన్ ఆట మాత్రమే మిగిలి ఉంది. దీంతో ఫలితం వచ్చే అవకాశాలు లేకపోవడంతో ఇరు జట్ల సారథులు మ్యాచ్‌ను డ్రాగా ముగిసేందుకు అంగీకరించారు. తొలి ఇన్నింగ్స్‌లో భారీ లీడ్ సాధించిన జమ్మూకశ్మీర్ టైటిల్‌ను దక్కించుకుంది. తొలి ఇన్నింగ్స్‌లో జమ్మూ కశ్మీర్ 584 పరుగులు చేయగా.. కర్ణాటక 293 పరుగులకే ఆలౌటైంది. ఫైనల్ మ్యాచ్ చివరి రోజు ప్రత్యేకంగా వీక్షించేందుకు జమ్మూ కశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా హుబ్బళ్లికి వచ్చారు. ఛాంపియన్‌గా అవతరించిన తర్వాత ప్లేయర్లతో కలిసి ఆయన సందడి చేశారు. చరిత్ర సృష్టించిన తమ జట్టుకు సీఎం ఒమర్ అబ్దుల్లా రూ. 2 కోట్లను నజరానాగా ప్రకటించారు.

## ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్నాం

### టీమ్ఇండియా మాజీ క్రికెటర్

రంజీ ట్రోఫీ టైటిల్‌ను జమ్మూ కశ్మీర్ సొంతం చేసుకోవడం లాంఛనమే. హుబ్బళ్లి వేదికగా కర్ణాటకతో జరుగుతున్న రంజీ ఫైనల్‌లో జమ్మూకశ్మీర్ భారీ ఆధిక్యంతో కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో జమ్మూకశ్మీర్ మాజీ కెప్టెన్, టీమ్ఇండియాకు ప్రాతినిధ్యం వహించిన పర్వేజ్ రసూల్ ఆనందం వ్యక్తంచేశాడు. చాలా ఏళ్లుగా ఈ రోజు కోసమే ఎదురు చూశామన్నాడు. అలాగే దేశవాళీల్లో జమ్మూకశ్మీర్ జట్టు ప్రయాణాన్ని ఓ వార్తా సంస్థకు వివరించాడు. 'యుధ్వీర్‌సింగ్ కర్ణాటకలో జరిగిన మొదటి ఇన్నింగ్స్‌లో చివరి వికెట్ తీశాక నేను చాలా ఆనందం వ్యక్తంచేశా. శనివారం (ఈ రోజు) జమ్మూకశ్మీర్ రంజీట్రోఫీ చాంపియన్స్‌గా అవతరించనుంది. ఇది ఇకపై కల కాదు.. వాస్తవం. మేం ఈ స్వప్నం సాకారం కావడం కోసం దశాబ్దాలుగా ఎదురు చూస్తున్నాం' అని అతడు అన్నాడు. అలాగే అయిదు వికెట్ల ప్రదర్శన చేసిన బౌలర్ అఖిబ్ నబీని పర్వేజ్ రసూల్ ప్రశంసించాడు. 'మా కోసం అఖిబ్ నబీ అద్భుతం చేశాడు. ఇలాంటి ప్రదర్శనను ఎవరూ గుర్తించకుండా ఉండలేరు. త్వరలోనే అతడు టీమ్ఇండియాకూ ఎంపికవుతాడనిపిస్తోంది' అని పర్వేజ్ ఆనందం వ్యక్తంచేశాడు. తొలుత బ్యాటింగ్ చేసిన జమ్మూకశ్మీర్ తొలి ఇన్నింగ్స్‌లో 584 పరుగుల భారీ స్కోర్ నమోదు చేసిన విషయం తెలిసిందే. తర్వాత కర్ణాటకను వారు 293 పరుగులకే కట్టడి చేశారు. అఖిబ్ నబీ 54 పరుగులిచ్చి 5 వికెట్లు తీసుకున్నాడు. దీంతో జమ్మూకశ్మీర్ 291 పరుగుల భారీ లీడ్ సాధించింది. జమ్మూకశ్మీర్.. రెండో ఇన్నింగ్స్‌లో లంచ్ బ్రేక్ అనంతరం.. 95 ఓవర్లు ముగిసేసరికి 4 వికెట్లు నష్టపోయి 285 పరుగులు చేసింది. ప్రస్తుతం లీడ్ 576 పరుగులుగా ఉంది.

# పాక్ ఇంటికి..
# కివీస్ సెమీస్‌కి

## లంకను గెలిచినా పాక్ ఔట్



పల్లెకెలె: గెలిచిన జట్టుకు ఆనందం లేదు.. పోరాడిన జట్టుకు ఉపయోగం లేదు. కానీ మైదానంలో లేని టీమ్ గంతులు వేసి ఉంటుంది. పాకిస్థాన్-శ్రీలంక గ్రూప్-2, సూపర్-8 మ్యాచ్‌లో పరిస్థితి ఇది. విజయం సాధించినా టీ20 ప్రపంచకప్ నుంచి పాకిస్థాన్ (3 మ్యాచ్‌ల్లో 3 పాయింట్లు) నిష్క్రమించక తప్పలేదు. సెమీస్ చేరాలంటే 147 స్కోరులోపు శ్రీలంకను కట్టడి చేయడంలో విఫలమైన ఆ జట్టు రన్‌రేట్ (-0.123)లో వెనుకబడి ఇంటిముఖం పట్టింది. పాక్ మాదిరే 3 మ్యాచ్‌ల్లో 3 పాయింట్లే సాధించినా.. మెరుగైన రన్‌రేట్‌తో న్యూజిలాండ్ (1.390) సెమీఫైనల్ బెర్తు దక్కించుకుంది. శనివారం మొదట పాక్ 8 వికెట్లకు 212 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఫర్హాన్ (100; 60 బంతుల్లో 9x4, 5x6) మెరుపు సెంచరీ చేశాడు. ఫకార్ జమాన్ (84; 42 బంతుల్లో 9x4, 4x6) కూడా రాణించాడు. ఛేదనలో లంక 6 వికెట్లకు 207 పరుగులే చేసింది. కెప్టెన్ శానక (76 నాటౌట్; 31 బంతుల్లో 2x4, 8x6), రత్నాయకే (58; 37 బంతుల్లో 4x4, 3x6) పోరాడినా జట్టును గెలిపించలేక పోయారు.

**శానక, రత్నాయకే బాదినా..:** పవర్‌ప్లేలోపు నిశాంక (3), మిషారా (26)ల వికెట్లు కోల్పోయిన లంక 5 ఓవర్లకు 37/2తో నిలిచింది. ఈ దశలో పవన్ రత్నాయకే నిలిచాడు. మొదట అసలంక (25), తర్వాత శానకతో కలిసి అతడు స్కోరును ముందుకు తీసుకెళ్లాడు. ఈ క్రమంలోనే 16వ ఓవర్లో 147 స్కోరును దాటిన లంక.. పాక్ సెమీస్ ఆశలపై నీళ్లు చల్లింది. 19వ ఓవర్లో శానక రెండు సిక్స్‌లు బాదడంతో చివరి ఓవర్లో 28 పరుగులు అవసరమయ్యాయి. షహీన్ వేసిన ఆఖరి ఓవర్లో శానక 4, 6, 6, 6 బాదేయడంతో సమీకరణం (2 బంతుల్లో 6) తేలికైపోయింది. కానీ తర్వాతి రెండు బంతులకు పరుగులు రాకపోవడంతో లంకకు ఓటమి తప్పలేదు. అంతకుముందు పాక్ ఓపెనర్లు ఫర్హాన్, ఫకార్ జమాన్ పోటీపడి ఆడడంతో ఆ జట్టు స్కోరుబోర్డు పరుగులెత్తింది. శ్రీలంక పేలవ బౌలింగ్, ఫీల్డింగ్ పాక్‌కు కలిసొచ్చింది. 12 ఓవర్లకు 102/0తో పాక్ భారీ స్కోరు దిశగా సాగింది. అయితే జమాన్ ఔటయ్యాక.. పాక్ అనూహ్యంగా తడబడింది. నఫే (2), షాదాబ్ (7), నవాజ్ (0), ఆఘా (0) స్వల్ప వ్యవధిలో ఔటయ్యారు. దీంతో పాకిస్థాన్ అనుకున్న దానికంటే తక్కువ స్కోరుకే పరిమితమైంది.

# మాట వినలేదని ఆంథ్రోపిక్‌ను వెళ్లగొట్టిన ట్రంప్

### ఓపెన్‌ఏఐతో అగ్రిమెంట్

అమెరికా రక్షణశాఖ డిమాండ్లకు నో చెప్పిన ఏఐ స్టార్టప్ ఆంథ్రోపిక్‌తో వ్యాపారం చేయబోమని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఆ టెక్నాలజీని వాడడం వెంటనే ఆపేయాలని అన్ని ప్రభుత్వ ఏజెన్సీలను ఆదేశించారు. అదే సమయంలో ఆంథ్రోపిక్ ప్రత్యర్థి సంస్థ ఓపెన్‌ఏఐతో పెంటగాన్ ఒప్పందం కుదుర్చుకుంది. ఈ విషయాన్ని ఓపెన్ ఏఐ సీఈఓ శామ్ ఆల్టమన్ వెల్లడించారు. ఆంథ్రోపిక్ క్లాడ్ మోడల్స్‌ను సైన్యం అపరిమితంగా వాడుకునేలా యాక్సెస్ ఇవ్వాలని పెంటగాన్ డిమాండ్ చేసింది. అందుకు శుక్రవారం వరకు గడువు విధించింది. అయితే అది ప్రజాస్వామ్య విధానాలకు విరుద్ధమని ఆంథ్రోపిక్ సీఈఓ డారియో అమోడెయ్ పేర్కొన్నారు. ఇది ట్రంప్‌నకు ఆగ్రహం తెప్పించింది. ఆ సంస్థతో మరోసారి వ్యాపారం చేయమని తేల్చిచెప్పారు. ఈ క్రమంలోనే ఓపెన్ ఏఐ ఎంటర్ అయింది. "అమెరికా రక్షణశాఖతో నిన్న ఒప్పందం కుదుర్చుకున్నాం. ఏఐని బాధ్యతాయుతంగా వినియోగించడంపై మా మధ్య చర్చ జరిగింది. ఇరువర్గాలు అంగీకారానికి వచ్చిన పరిమితుల్లోనే ఏఐ మోడల్స్ పనిచేస్తాయని నిర్ధరించేందుకు సాంకేతికపరమైన విధానాలను ప్రవేశపెట్టనున్నాం" అని ఆల్టమన్ వెల్లడించారు.

**బెదిరింపులు పట్టించుకోం : ఆంథ్రోపిక్**

బెదిరింపులు ఎన్ని వచ్చినా తమ విధానాల్లో ఎలాంటి మార్పు ఉండదని ఆంథ్రోపిక్ ఓ ప్రకటనలో వెల్లడించింది. నిఘా, మిలిటరీ వ్యవహారాల్లో అపరిమిత ఏఐ వినియోగానికి సంబంధించిన నైతిక నిబంధనలను ఉల్లంఘించలేమని స్పష్టం చేసింది.

# ఏఐ ముప్పు లేని ఉద్యోగాలున్నాయ్

### జోహో సీఈఓ శ్రీధర్ వెంబు

కృత్రిమ మేధ (ఏఐ) వల్ల, పలు రంగాల్లో ఉద్యోగాలు పోతాయనే ఆందోళనలు నెలకొన్నాయి. అయితే ఏఐ ముప్పు దరిచేరని ఉద్యోగాలూ చాలానే ఉన్న విషయాన్ని గుర్తించాలని జోహో వ్యవస్థాపకుడు, సీఈఓ శ్రీధర్ వెంబు తెలిపారు. డబ్బు కంటే అభిరుచి ప్రాధాన్యంగా అవి ఉండటం వల్ల, ఏఐ ముప్పు వాటిని తాకలేదని 'ఎక్స్' పోస్ట్‌లో ఆయన తెలిపారు. పిల్లలు-వృద్ధుల సంరక్షణ, బోధన, నచ్చిన విభాగంలో వ్యవసాయం, అడవుల సంరక్షణ, దేవాలయాల ఆచారాలు, శాస్త్రీయ సంగీతం లాంటి వాటిని ఏఐ తాకలేదని ఆయన చెప్పారు. మానవత్వం అనే అంశమే ఈ పనుల ఉద్దేశాలను ఎక్కువగా ప్రభావితం చేస్తుందని వెల్లడించారు. భిన్నాభిప్రాయాలు: వెంబు చేసిన ఈ వ్యాఖ్యలు నెట్టింట్లో తీవ్ర చర్చకు దారితీశాయి. నచ్చిన - అభిరుచి ఉన్న పనిలో నిలదొక్కుకోవడంతో పాటు బతికేందుకు నిధులూ అవసరమని ఒకరు బదులిచ్చారు. తగినంత సంపద ఉంటేనే కళ అయినా, సంస్కృతి అయినా అభివృద్ధి చెందుతుందని వాదించారు. దీనిపై వెంబు స్పందిస్తూ డబ్బు కోణంలో నుంచి బయటికి రావాలని విమర్శకులను కోరారు. 'ఏఐ, దాని సంబంధిత సాంకేతికతలతో వస్తువులు, సేవల ఉత్పాదకత పెరుగుతుంది. అయితే తగినంత ఉద్యోగాలు, ఆదాయాలు సృష్టించకపోతే.. ఆ వస్తువులు, సేవలను ప్రజలు వినియోగించుకోగలరా? అన్నదే అసలైన సవాలు' అని ఆయన వివరించారు. పూర్వకాలంలో దేవాలయాలపై శిల్పాలు చెక్కే కళాకారులకు, వాళ్ల జీవనం గడిపేందుకు అవసరమైన ధాన్యం, వస్తువులను మాత్రమే ఇచ్చేవాళ్లని.. ఇప్పుడులా వేతనాలు ఇచ్చేవాళ్లు కాదని గుర్తు చేశారు. తగిన ఉపాధి లేకుండా, సాంకేతికత ద్వారా ఉత్పాదకతను పెంచితే.. ఆ మిగులు ఉత్పాదకతను సమాజానికి పంచేందుకు రాజకీయ, ఆర్థిక పరిష్కారాలు అవసరం అవుతాయని వెంబు అన్నారు. నగరాల పునర్నిర్మాణం దగ్గర నుంచి, జీవన నాణ్యత మెరుగుపర్చడం వరకు దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి వీలు కల్పించడం ద్వారా కొత్త రకాల ఉద్యోగాలను ఏఐ సృష్టిస్తుందని వెంబు పోస్ట్‌పై మరొకరు వ్యాఖ్య చేశారు.



## హాట్ లుక్‌లో రిద్ధి కుమార్

రిద్ధి కుమార్ 2018లో విడుదల అయిన లవర్ సినిమాతో వెండితెరకు పరిచయం అయింది. ఈ చిత్రం బాక్సాఫీస్ దగ్గర బోల్తా కొట్టింది. దాంతో ఈ ముద్దుగుమ్మకు పెద్దగా అవకాశాలు రాలేదు. ఆ తర్వాత ఈ బ్యూటీ చిన్న సినిమాల్లో నటిస్తూ కెరియర్ను ముందుకు సాగించింది. అలాంటి సమయంలోనే రిద్ధి కుమార్, ప్రభాస్ హీరోగా మారుతీ దర్శకత్వంలో రూపొందిన 'రాజా సాబ్'లో అవకాశం అందుకుంది. దాంతో ఒక్కసారిగా ఈమె పేరు వైరల్ కావడం మొదలైంది. అయితే, ఈ సంక్రాంతికి రాజా సాబ్ ప్రేక్షకుల ముందుకు వచ్చింది. కానీ ఈ చిత్రం జనాల్ని పెద్దగా ఆకట్టుకోలేదు. కానీ ఇందులో ఈమె తన అందంతో ప్రేక్షకులను బాగా అలరించింది. ప్రభాస్ లాంటి స్టార్ హీరో సినిమాలో హీరోయిన్గా నటించడంతో రిద్ధి కుమార్ వం-ంస పెట్టి సినిమాల్లో అవకాశాలను అందుకుంటుందని చాలామంది భావిస్తున్నారు. ఈ నటి సినిమాల విషయం కాసేపు పక్కన పెడితే సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటూ తన అభిమానులతో అనేక విషయాలు పంచుకుంటుండడంతో ఈమెకు అనేకమంది ఫాలోవర్స్ కూడా ఉన్నారు. ఈమె అప్పుడప్పుడు తనకు సంబంధించిన హాట్ ఫోటోలను కూడా అందులో పోస్ట్ చేస్తూ వస్తుంది, అవి సూపర్ గా వైరల్ అయిన సందర్భాలు కూడా ఉన్నాయి. తాజాగా ఈ ముద్దుగుమ్మకు సంబంధించిన కొన్ని ఫోటోలు వైరల్ అవుతున్నాయి. అందులో ఈ హీరోయిన్ సూపర్ హాట్ లుక్లో ఉన్న స్లీవ్ లెస్ డ్రెస్ వేసుకొని తన ఎద అందాలు ఫోకస్ అయ్యేలా స్టిల్స్ ఇచ్చింది, ప్రస్తుతం అవి వైరల్ అవుతున్నాయి.

## వెంకటప్పనాయుడుగా మోహన్ బాబు

కలెక్షన్ కింగ్ డాక్టర్ మోహన్ బాబు మరోసారి వెండితెరపై తన గంభీరమైన నటనతో అలరించబోతున్నారు. అజయ్ భూపతి దర్శకత్వంలో 'శ్రీనివాస మంగపురం' అనే క్రేజీ ప్రాజెక్ట్ రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాలో మోహన్ బాబు పోషిస్తున్న 'వెంకటప్పయ్య నాయుడు' పాత్రకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను చిత్రబృందం నేడు విడుదల చేసింది. ఈ పోస్టర్‌లో మోహన్ బాబు లుక్ ఎంతో పవర్ ఫుల్ గా, రాజసంతో ఉట్టిపడుతోంది. గర్వం, ధైర్యం కలగలిసిన ఒక గంభీరమైన పాత్రలో ఆయన కనిపించబోతున్నారని చిత్ర యూనిట్ పేర్కొంది. 'మహాసముద్రం', 'మంగళవారం' వంటి సినిమాలతో తనకంటూ ఒక ప్రత్యేక శైలిని ఏర్పరచుకున్న దర్శకుడు అజయ్ భూపతి, మోహన్ బాబును ఒక సరికొత్త కోణంలో చూపించబోతున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రంతో సూపర్ స్టార్ కృష్ణ మనవడు, రమేష్ బాబు కుమారుడు జయకృష్ణ ఘట్టమనేని వెండితెరకి పరిచయం కాబోతుండగా.. బాలీవుడ్ నటి రవీనా టాండన్ కుమార్తె రాశా థడాని హీరోయిన్‌గా నటిస్తుంది. ప్రముఖ నిర్మాతలు అశ్వినీదత్, జెమిని కిరణ్ ఈ చిత్ర నిర్మాణంలో పాలుపంచుకుంటున్నారు. జి.వి. ప్రకాష్ కుమార్ ఈ సినిమాకు సంగీతాన్ని అందిస్తున్నాడు.



## రణబాలి నుంచి ఎందయ్యా సామీ సాంగ్ విడుదల



టాలీవుడ్ కొత్త జంట రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ, నేషనల్ క్రష్ రష్మిక మందనలకి స్పెషల్ సర్‌ప్రైజ్‌ని ఇచ్చారు రణబాలి మేకర్స్. వీరిద్దరూ జంటగా రాహుల్ సంకృత్యన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'రణబాలి'. ఈ సినిమాలో విజయ్ 'రణబాలి'గా, రష్మిక 'జయమ్మ'గా నటిస్తున్నారు. ఇటీవల వివాహబంధంలోకి అడుగుపెట్టిన వీరికి చిత్రబృందం స్పెషల్ సర్‌ప్రైజ్‌ని ఇస్తూ.. చిత్రంలోని రొమాంటిక్ మెలోడీ 'ఎందయ్య సామి' పాటను విడుదల చేశారు. ప్రముఖ సంగీత ద్వయం అజయ్-అతుల్ అందించిన ఈ పాట వినగానే ఆకట్టుకునేలా ఉంది. తెలుగులో 'ఎందయ్య సామి', తమిళంలో 'ఎదయ్యా సామి', హిందీలో 'ఓ మేరే సాజన్' అంటూ ఐదు భాషల్లో ఈ పాటను విడుదల చేశారు. పాటలో విజయ్, రష్మికల మధ్య కెమిస్ట్రీ మునుపటి 'గీత గోవిందం' రోజులను గుర్తు చేస్తోందని అభిమానులు సోషల్ మీడియాలో కామెంట్స్ చేస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తుంది. ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 11న ప్రపంచవ్యాప్తంగా భారీగా విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. హాలీవుడ్ నటుడు ఆర్నాల్డ్ వోస్లూ (మమ్మీ ఫేమ్) కూడా ఈ చిత్రంలో ఒక కీలక పాత్రలో నటిస్తుండటం విశేషం.




## దురంధర్ పార్ట్2 విడుదలకు సిద్ధం

బాలీవుడ్ స్టార్ హీరో రణవీర్ సింగ్ ప్రధాన పాత్రలో, స్టార్ దర్శకుడు ఆదిత్య ధర్ దర్శకత్వంలో తెరకెక్కిన భారీ యాక్షన్ స్పై థ్రిల్లర్ 'ధురంధర్: ది రివేంజ్' విడుదలకు సిద్ధమవుతోంది. అయితే ఈ సినిమా రన్ టైమ్ వివరాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ సినిమా నిడివి 220 నిమిషాలుగా ఉన్నట్లు సమాచారం. అంటే ఈ చిత్రం దాదాపు 3 గంటల 40 నిమిషాల సుదీర్ఘ రన్ టైమ్‌తో ప్రేక్షకులను అలరించబోతుంది. మొదటి భాగం 3 గంటల 34 నిమిషాలు తో పోలిస్తే ఇది 6 నిమిషాలు ఎక్కువ ఉన్నప్పటికీ, ప్రస్తుత కాలంలో అత్యంత సుదీర్ఘమైన నిడివి కలిగిన చిత్రాల జాబితాలో ఇది ఒకటిగా నిలుస్తోంది. ఈ చిత్ర కథాంశం విషయానికి వస్తే, మొదటి భాగంలో గ్యాంగ్‌స్టర్ రెహ్మాన్ డకైట్‌ను అంతం చేసిన తర్వాత, హమ్జా అలీ మజారీ పాత్రలో రణవీర్ సింగ్ తన తదుపరి లక్ష్యమైన ఐఎస్ఐ వ్యూహకర్త 'బడే సాబ్' (మేజర్ ఇక్బాల్)ను ఎలా ఎదుర్కొన్నాడు అనే ఉత్కంఠభరితమైన అంశాలతో ఈ సీక్వెల్ సాగనుంది. రణవీర్ సింగ్‌తో పాటు ఈ చిత్రంలో సంజయ్ దత్, ఆర్. మాధవన్, అక్షయ్ ఖన్నా మరియు అర్జున్ రాంపాల్ వంటి దిగ్గజ నటులు కీలక పాత్రల్లో నటిస్తుండగా, సారా అర్జున్ కథానాయికగా నటించింది. ఈ భారీ యాక్షన్ ఎంట్టంల్గ÷నర్ మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. అదే రోజున కన్నడ స్టార్ యాష్ నటిస్తున్న 'టాక్సిక్' కూడా విడుదలవుతుండటంతో బాక్సాఫీస్ వద్ద ఈ రెండు భారీ చిత్రాల మధ్య గట్టి పోటీ నెలకొననుంది.



## విష్ణు విన్యాసం మూవీ లీక్

### అందుకే త్వరగా విడుదల చేశాం

'విష్ణు విన్యాసం' మూవీ లీక్ అవడం వల్ల చాలా విషయాలు జరిగాయని అందుకే వారం గ్యాప్‌తో తన రెండు సినిమాలు విడుదల చేయాల్సి వచ్చిందని శ్రీవిష్ణు తెలిపారు. ఆయన కథానాయకుడిగా యదునాథ్ మారుతీరావు దర్శకత్వంలో రూపొందిన కామెడీ ఎంటర్‌టైనర్ ఇది. నయన్ సారిక కథానాయిక. తాజాగా ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ మూవీ చక్కటి వినోదాన్ని పంచుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో శ్రీవిష్ణు మాట్లాడారు. 'సినిమా లీక్ అవడం వల్ల షూటింగ్ హడావుడిగా అయిందన్నారు. స్క్రిప్ట్‌లో ఏమైనా మార్పులు చేశారా' అని అడగ్గా, 20 రోజుల పనిని ఏడు రోజుల్లో రాత్రి, పగలూ విరామం లేకుండా చేయాల్సి వచ్చింది. టీమ్ అంతా సహకారం అందించారు. అలా చేస్తేనే ఈ టైమ్‌కు రాగలిగాం. పూర్తి ఎ÷-లానింగ్ లేకుండా ప్రచార కార్యక్రమాలు మొదలుపెట్టాల్సి వచ్చింది. దానివల్లే రెండు సినిమాలు ఒకదాని తర్వాత ఒకటి వచ్చాయి. చెన్నై నుంచి ఈ సినిమాను లీక్ చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేశాం. దీనిపై కేసు నడుస్తోంది. మా నిర్మాతని బ్లాక్ మెయిల్ చేశారు. ఆయనను బెదిరిస్తూ వాళ్లు పెట్టిన సందేశాలు, ఛాంబర్‌కు మేము చేసిన ఫిర్యాదులు అన్నీ మా దగ్గర ఉన్నాయి. భవిష్యత్‌లో ఇలాంటి సమస్యలు రాకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న దానిపై చర్చించాలి. ప్రతి రీల్‌కు నిర్మాతను బ్లాక్ మెయిల్ చేశారు. విడుదల ముందురోజు వరకూ ఇదంతా జరిగింది. ఆ విషయంలో నిర్మాత చాలా ఇబ్బందిపడ్డారు. అలాగని మమ్మల్ని ఆందోళనకు గురి చేయలేదు' అని శ్రీవిష్ణు తెలిపారు. నిర్మాత సుమంత్ నాయుడు మాట్లాడుతూ.. 'వరుసగా ఈ సినిమాకు సంబంధించిన వీడియోలను నాకు పంపారు. ఆ సందేశాలు చూడగానే నా భవిష్యత్ కళ్ల ముందు కనపడింది. మా యూనిట్ నుంచే తెలియకుండా సన్నివేశాలు వెళ్లిపోయాయి. మాకు సినిమా క్లిప్‌లను పంపిన నెంబర్‌ను ట్రేస్ చేశాం. ఆ తర్వాత ఛాంబర్‌లో ఫిర్యాదు చేశాం. చాలా మానసిక క్షోభ అనుభవించాం. పరిస్థితి అదుపు తప్పడంతోనే మిగిలిన షూటింగ్ వేగంగా పూర్తి చేసి, ఈ సినిమాను తీసుకురావాల్సి వచ్చింది. అంతేకానీ, 'మృత్యుంజయ్' మూవీకి పోటీగా దీన్ని విడుదల చేయాలన్న ఉద్దేశం మాకు లేదు. ఆ చిత్ర నిర్మాత పరిస్థితిని అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నా అని అన్నారు.

## స్పిరిట్ నుంచి వివేక్ ఒబెరాయ్ లుక్ విడుదల

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, స్టార్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న హై రేంజ్ యాక్షన్ థ్రిల్లర్ 'స్పిరిట్'పై అంచనాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. తాజాగా చిత్రబృందం విడుదల చేసిన విలన్ ఫస్ట్ లుక్ పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. బాలీవుడ్ నటుడు వివేక్ ఒబేరాయ్ ఈ చిత్రంలో ప్రతినాయకుడిగా నటిస్తున్న సంగతి తెలిసిందే. 'వన్ బ్యాడ్ హ్యాబిట్ ఇన్ స్పిరిట్ మోడ్' అనే ట్యాగ్‌తో విడుదల చేసిన పోస్టర్‌లో వివేక్ ఓబెరాయ్ నోట్లో సిగార్‌తో పవర్‌ఫుల్ యాక్షన్ లుక్‌లో కనిపించారు. పోస్టర్‌ను బట్టి ఆయన ఓ డాన్ పాత్రలో కనిపించనున్నట్లు అర్థమవుతోంది. అయితే అదే పోస్టర్‌లో వివేక్ పక్కన కనిపించిన యువతి ఎవరు? అనే చర్చ సోషల్ మీడియాలో మొదలైంది. ఆమె పేరు ఐశ్వర్య దేశాయ్. యూనివర్సిటీ ఆఫ్ మేరీల్యాండ్ నుంచి మార్కెటింగ్‌లో డిగ్రీ పూర్తి చేసిన ఇండో-అమెరికన్ నటి. బాలీవుడ్ చిత్రం 'గల్లీ బాయ్'లో నటించిన ఆమె, 'ర్యాట్ ఇన్ ద కిచెన్' అనే షార్ట్ ఫిల్మ్‌తో మంచి గుర్తింపు పొందారు. ఆ చిత్రానికి ఉత్తమ సహాయ నటిగా అవార్డు కూడా అందుకున్నారు. ఇప్పుడు 'స్పిరిట్' చిత్రంతో తెలుగు తెరకు పరిచయం అవుతున్నారు. పోస్టర్‌లో వివేక్‌తో కలిసి కనిపించడం వల్ల సినిమాలో ఆమెకు కీలక పాత్ర ఉన్నట్టు సినీ వర్గాలు చెబుతున్నాయి. ఒక్క పోస్టర్‌తోనే ఆమెకు మంచి క్రేజ్ వచ్చింది. ఈ చిత్రంలో ప్రభాస్ సరసన త్రిప్తి డిమ్రి హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్, లుక్స్ ప్రేక్షకుల్లో గూస్‌బంప్స్ తెప్పించాయి. విలక్షణ నటుడు ప్రకాశ్ రాజ్ కీలకపాత్ర పోషిస్తుండగా, సీనియర్ నటి కాంచన కూడా ప్రధాన పాత్రలో కనిపించనున్నారు. ఈ సినిమాలో ప్రభాస్ ఇప్పటివరకు చూడని విధంగా ఓ పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించనున్నారు. మాఫియా బ్యాక్‌డ్రాప్‌తో పాటు పోలీస్ డ్రామా ఎలిమెంట్స్ కూడా ఉండనున్నట్లు టీజర్ సూచిస్తోంది. పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతున్న ఈ చిత్రం తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళం భాషలతో పాటు చైనీస్, కొరియన్ సహా పలు విదేశీ భాషల్లో వచ్చే ఏడాది మార్చి 5న విడుదల కానుంది.



## ప్రతి వారం ఓ నెగిటివ్ వార్త వస్తూనే ఉంటుంది

- సోషల్ మీడియాపై ప్రియాంక షాకింగ్ కామెంట్స్

సూపర్ స్టార్ రజినీకాంత్, డైరెక్టర్ సిబి చక్కవర్తి కాంబినేషన్‌లో చిత్రంలో దర్శకుడు బాసిల్ జోసెఫ్ అండ్ హీరోయిన్ ప్రియాంక మోహన్ కీలక పాత్రల్లో నటిస్తున్నట్లు నెట్టింట వార్తలు వస్తున్న క్రమంలో.. వీటిపై క్లారిటీ ఇచ్చింది ప్రియాంక. సిబి చక్రవర్తి డైరెక్షన్‌లో వచ్చిన 'డాన్' మీకు పెద్ద హిట్ ఇచ్చింది. ఇప్పుడు ఆయన చేస్తున్న రజనీకాంత్ సినిమాలో మీరు నటిస్తున్నారా అనే ప్రశ్నపై ప్రియాంక మోహన్ స్పందిస్తూ.. 'రజనీ సర్ సినిమా కథ ఏమిటో నాకు తెలియదు. నేను అందులో భాగం అవుతానో లేదో నాకు ఖచ్చితంగా తెలియదు. అయితే.. 'డాన్' పెద్ద హిట్. ఆ తర్వాత సిబి నెక్ట్స్ ఏ మ్యాజిక్ చేయబోతున్నాడా అని 'డాన్' టీం ఆసక్తిగా ఎదురుచూసింది. సిబి సర్ ఇప్పుడు రజనీ సర్‌తో సినిమా చేస్తున్నందుకు నేను చాలా సంతోషంగా ఉన్నాను. అలాగే నా టీమ్ అంతా చూసుకుంటుంది. సోషల్ మీడియాలో వచ్చే నెగిటివ్ వార్తలను నేను పట్టించుకోను. ఎందుకంటే ప్రతి వారం ఏదో ఒక కొత్త పుకారు వస్తూనే ఉంటుంది. కొంతకాలం తర్వాత ప్రజలు వేరే కొత్త పుకారు కోసం సిద్ధం అవుతారు. అందుకే వాళ్లు సృష్టించే నెగిటివ్ వార్తలు నేను పట్టించుకోను' అంటూ చెప్పుకొచ్చింది ప్రియాంక.



Printed, Published and Owned by **MALOTHU CHANDRAKALA,** Printed at Sri Venkateswara Printing Solutions, Medipally Mandal, Medchal - Malkajigiri District, Telangana, Pin : 500098 . Editor: **MALOTHU CHANDRAKALA**. Telangana **RNI NO :TELTEL12881** Contact: 83281 23579 email id:tholikranthi@gmail.com